Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 09.08.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## దిగంతాలకు ధీర వనిత

### విదేశీ వ్యవహారాలకే వన్నె తెచ్చిన మహిళా మాణిక్యం

(వివరాలు 11వ పేజీలో)



# ఇద్దరు మొనగాళ్ళు




- 7 దశాబ్దాల సమస్యకు ఒకేరోజులో పరిష్కారం
- ఆర్టికల్ 370 రద్దుకు మెజార్టీ పక్షాల మద్దతు
- అమాంతం పెరిగిన మోడీ-షాల ఇమేజ్

జమ్మూ, కాశ్మీర్... దేశానికి తల వంటిది. ప్రకృతి అందాలకు ప్రసిద్ధి గాంచిన ప్రాంతం. భారత్‌లో ఇదో భాగం. కాని, అది పేరుకు మాత్రమే! అక్కడ వ్యవహారశైలి అంతా కూడా చాలా భిన్నంగా వుండేది. రెండు జెండాలు, రెండు పౌరసత్వాలు!.. భారత చట్టాలు అక్కడ చెల్లవు. భారత రాజ్యాంగం చెల్లదు. ఇతర రాష్ట్రాల వాళ్ళు అక్కడకు వెళ్లి ఆస్తులు కొనలేరు. వ్యాపారాలు చేయలేరు. 7దశాబ్దాల పాటు దేశ జీవనశైలికి దూరంగా జమ్మూ కాశ్మీర్‌ను ఉంచారు. ఆర్టికల్370 ద్వారా వచ్చిన స్వయం ప్రతిపత్తితో జమ్మూ - కాశ్మీర్ అభివృద్ధి చెందిందేమీ లేకపోగా అర్ధశతాబ్దం నుండి ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారుతూ వస్తోంది. కేవలం జమ్మూ-కాశ్మీర్ అంశం కారణంగానే దేశ ఆర్థిక వ్యవస్థపై లక్షల కోట్ల భారం పడింది. వేలల్లో సైనికులు, పౌరులు చనిపోయారు.

(మిగతా 11వ పేజీలో)




## ఏపిని... జగన్‌తో...

# ఆదుకుంటారా? ఆడుకుంటారా?





- సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర మద్దతు కోరిన సీఎం
- అన్ని విధాలా ఆదుకుంటామని సానుకూలంగా స్పందించిన పీఎం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది. గత ఐదేళ్లలో దేశంలో ధనిక సీఎంగా పేరు తెచ్చుకున్న చంద్రబాబునాయుడు రాష్ట్రానికి మాత్రం తన దుబారాతో దరిద్రం పట్టించాడు. రాష్ట్రం నెత్తి మీద 2.58లక్షల కోట్ల అప్పు మిగల్చడమేకాక వేలకోట్ల నిధులను దుర్వినియోగపరిచాడు. ఎన్నికల నాటికి రాష్ట్ర ఖజానాను చిల్లరతో సహా ఊడ్చేశాడు.

ఇప్పుడు అధికారంలో వున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని చూస్తే... ఆయన రాష్ట్ర ఖజానా వైపు కన్నెత్తి కూడా చూడ్డం లేదు. ఎన్నికల నాటి మేనిఫెస్టోను జేబులో పెట్టుకుని వీలున్నప్పుడల్లా దానిని బయటకు తీసి చదువుతున్నాడు. చదివినప్పుడల్లా ఒక్కో హామీని అమలులోకి తెస్తున్నాడు. గత రెండు నెలల్లోనే దాదాపు మేనిఫెస్టోలోని హామీలన్నింటిని అధికారికంగా ప్రకటించేశాడు. అయితే ఈ హామీలు రూపాయి, అర్ధరూపాయితో అమలయ్యేవి కాదు. ఈ రెండు నెలల్లో ఆయన అమలులోకి తెచ్చినవన్నీ కూడా సంక్షేమ కార్యక్రమాలే! వీటిని అమలు చేయాలంటే వేలకోట్లలో నిధులు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద చూస్తే...

(మిగతా 11వ పేజీలో)



# పెన్నమ్మ చెంతకు కృష్ణమ్మ

- సోమశిలకు నీళ్ల పరుగులు
- జిల్లా రైతాంగానికి ఊపిరొచ్చింది



జిల్లాలో వర్షాలు లేవు.... ఇప్పుడే కాదు గత మూడేళ్లుగా పడలేదు. 46 మండలాలలోనూ తీవ్ర కరువు ఛాయలు.. పంటలకు సాగునీళ్ల మాట దేముదెరుగు... తాగడానికి నీళ్లు లేని దుస్థితి. మెట్ట ప్రాంతంలోని చాలా గ్రామాలలో ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ నీళ్ళు తోలుతున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు ఇప్పుడు ప్రజలకు చేసే మంచి పని, పెద్దమేలు ఏంటంటే ట్యాంకర్ల ద్వారా సక్రమంగా నీళ్ళు తోలడమే!

సోమశిల రిజర్వాయర్‌లో నీళ్ళు డెడ్ స్టోరేజ్‌కు చేరుకున్నాయి. జిల్లాలో నీళ్ళు లేక రెండో పంట ఎలాగూ వేయలేదు. ఇక తాగునీళ్ళకు కూడా సోమశిలలో నీళ్ళు లేని పరిస్థితి. ఈ స్థితిలో శ్రీశైలం రిజర్వాయర్ నుండి సోమశిల వైపు వస్తున్న వరద ప్రవాహం జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. కర్నాటకలో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల రిజర్వాయర్‌లు నిండడంతో వాటి గేట్లు ఎత్తేశారు. దీంతో కృష్ణా వరద ప్రవాహం శ్రీశైలంకు పోటెత్తింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి సోమశిలకు నీళ్ళు వదిలారు. మొదట రెండు వేల క్యూసెక్‌లతో మొదలు పెట్టి క్రమంగా పెంచుతున్నారు. శ్రీశైలంకు ఇలాగే ఇంకొన్ని రోజులు వరద ప్రవాహం కొనసాగితే సోమశిలకు సమృద్ధిగా జలాలు చేరే అవకాశముంది. ఇక ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో మంచి వానలు పడొచ్చనే ఆశలు వున్నాయి. కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసినా కరువు గండాన్ని అధిగమించవచ్చు.

## యువత దేశసేవకు పాటుపడాలి

యువత దేశసేవకు పాటుపడాలని, అప్పుడే వారు ఉత్తమపౌరులుగా రాణిస్తారని ఎన్‌సిసి కెప్టెన్ జి.ఎస్ యుగంధర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 3న నెల్లూరులోని సెయింట్‌పీటర్స్ హైస్కూల్‌లో 10 (ఎ) నావెల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో సంయుక్త వార్షిక క్యాంప్ రెండవరోజును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బొల్లినేని ఆసుపత్రి వారి సహకారంతో ఉచితవైద్యశిబిరం ఏర్పాటుచేసి 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. నగరంలోని రంగనాయకులపేట, సంతపేట తదితర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిసి అధికారులు డాక్టర్ సురేష్, డాక్టర్ ఎన్. ప్రభాకర్, ఎస్.ఏ జయకుమార్, నాగరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు డిఎస్పీగా మక్బూల్

ఆత్మకూరు డిఎస్పీగా షేక్ మక్బూల్‌ను నియమిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలో సిసిఎస్-3 ఏసిపిగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. గుంటూరుజిల్లా బట్టిప్రోలు ఆయన స్వగ్రామం. 1989లో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఒంగోలు, మార్కాపురం, చీరాల, పరుచూరు, పామూరులలో ఎస్ఐగా పని చేశారు. 2003లో సిఐగా పదోన్నతి పొందారు. నెల్లూరులో రైల్వేలోనూ, పామూరు, గిద్దలూరు, మార్కాపురం సి.ఐగాను, ఒంగోలు స్పెషల్ బ్రాంచ్ సి.ఐగానూ పని చేశారు. 2012లో డిఎస్పీగా పదోన్నతి పొంది ఒంగోలు పిటిసి, ఏసిబి డిఎస్పీగాను, 2014లో నెల్లూరు నగర డిఎస్పీగాను పని చేశారు. ఇక్కడ నుండే విజయవాడకు బదిలీ అయ్యారు. అక్కడనుండి ఇప్పుడు ఆత్మకూరుకు వస్తున్నారు.

## పోలీసుల దాడిలో పోలీసులే పట్టుబడ్డారు

ఈ నెల 6వ తేదీన నెల్లూరు దర్గామిట్ట పోలీసులు బొల్లినేని ఆసుపత్రి సమీపంలో ఓ ఇంట్లో జూదం జరుగుతుందనే సమాచారంతో ఆ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాటలో మునిగివున్న ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్ళతో పాటు మరో ఏడుగురు పేకాటపాపారావులను కూడా అరెస్ట్ చేసి లక్షా 5వేల నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సి.ఐ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఈ దాడి నిర్వహించారు.

## వాలంటీర్లు పారదర్శకతతో పనిచేయాలి

వాలంటీర్లు పారదర్శకతతో పనిచేస్తూ జవాబుదారితనంగా వుండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 5న కావలి మునిసిపాలిటీలో వాలంటీర్లకు నియామకపు పత్రాలను అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పార్టీలు, కులమతాలు, ప్రాంతాలు చూడకుండా అవినీతికి తావులేకుండా వాలంటీర్లు ప్రజలకు సేవలు అందించాలన్నారు. అభివృద్ధి సాధించడానికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి వలంటీర్లు పలు రకాల సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రతి వాలంటీర్ తనకు కేటాయించిన 50 కుటుంబాలతో సన్నిహితంగా ఉంటూ మనస్సాక్షితో పనిచేసి నిజాయితీని అలవర్చుకోవాలన్నారు. కావలి సబ్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లరావు, వైయస్సార్ సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, గుడ్లూరు మాల్యాద్రి, పొనుగోటి అనూరాధ, కుందుర్తి సునీత పాల్గొన్నారు.

## ఈ నెలాఖరు వరకు బిపిఎస్

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పట్టణాభివృద్ధి సంస్థ వైస్‌ఛైర్మెన్ టి.బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నుడా పరిధిలోని 21 మండలాలలోని 158 గ్రామ పంచాయితీలు, నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, కావలి, సూళ్లూరుపేట మున్సిపాల్టీలు, నాయుడుపేట నగర పంచాయితీ పరిధిలో 1985 జనవరి 1 నుండి 2018 ఆగస్టు 31 వరకు అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరించుకోవాలనుకుంటున్న భవన యజమానులు ఈ నెల 31లోగా బిపిఎస్ క్రింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గడువు ముగిశాక ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబు

ఈనెల 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్ సిద్ధమవుతోంది. ఈసారి వేడుకలకు ఇక్కడ వేదికను ఎంతో అందంగా నిర్మించారు. ప్రతి సంవత్సరం వేదికపై షామియానాలు వేస్తుండగా, ఇప్పుడు శాశ్వతంగా శ్లాబుతో నిర్మాణం చేపట్టారు. అతిథులు, ఆహ్వానితుల కోసం కుర్చీలు, షామియానాలు వేస్తున్నారు. వివిధ శాఖల వారు శకటాల రూపకల్పనలో వుండగా, సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో దేశభక్తి పూర్వక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అయితే, ఈసారి మంత్రి హోదాలో ఎవరు పతాక ఆవిష్కరణ చేయబోతున్నారో ఇంకా స్పష్టత రాలేదు.

## నేతన్నలకు వెన్నుదన్నుగా ఉంటాం..

### సంగంలో జరిగిన రాష్ట్రస్థాయి చేనేత సదస్సులో మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి



రాష్ట్రంలో చేనేతకారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరలోనే వారికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 7న సంగంలోని టిడిఆర్ కల్యాణమండపంలో జరిగిన రాష్ట్రస్థాయి చేనేత సదస్సులో మంత్రి పాల్గొని ఆ సదస్సును జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేతన్నల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని పథకాలు ఆ గుర్తింపుకార్డుల ద్వారానే అందేలా చూస్తామన్నారు. నేతన్నల సమస్యల పరిష్కారానికి తాము అన్నివేళలా ముందుంటామన్నారు. నేతన్నల అభివృద్ధికి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తామన్నారు. నవరత్నాల హామీల్లో భాగంగా ప్రతి చేనేత కుటుంబానికి భరోసా కల్పించేందుకు నెలకు 2వేల రూపాయల వంతున ఏడాదికి 24వేల రూపాయలను అందజేస్తామన్నారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేనేతకారుల సమస్యల పరిష్కారానికి ధర్మవరంలో దీక్ష చేపట్టిన విషయాన్ని మంత్రి గౌతమ్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

రాష్ట్ర చేనేత జౌళిశాఖ కార్యదర్శి ఐ.నరేష్ మాట్లాడుతూ విదేశాల్లో టెక్స్‌టైల్స్‌కు సంబంధించి పీజీ పూర్తిచేసిన గౌతమ్‌రెడ్డి చేనేత జౌళిశాఖకు మంత్రిగా ఉండడం రాష్ట్ర చేనేత పరిశ్రమ అదృష్టమన్నారు. టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు సంబంధించి ఆయనకున్న అనుభవం రాష్ట్రంలోని చేనేత పరిశ్రమకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇదెంతో శుభపరిణామమని అన్నారు. జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు మాట్లాడుతూ చేనేతకారుల సమస్యల పరిష్కారానికి ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రత్యేక గ్రీవెన్స్‌డేని కలెక్టరేట్‌లో నిర్వహిస్తామన్నారు. తొలుత ఈ రాష్ట్రస్థాయి చేనేత సదస్సులో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను, అత్యద్భుతమైన రీతిలో ఉన్న చేనేతవస్త్రాలను మంత్రి గౌతమ్‌రెడ్డి పరిశీలించి చేనేతకారుల కళాత్మకతను, హస్తకళాకారులు రూపొందించిన బొమ్మలను చూసి ఎంతగానో అభినందించారు. ఆ తర్వాత రాట్నం వద్ద కూర్చుని రాట్నం వడుకుతూ మురిసి పోయారు. కొద్దిసేపు మగ్గం నేసి ఆనందం వ్యక్తం చేశారు. చేనేత జౌళి శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, అదనపు ఏ.డి శ్రీకాంత్ ప్రభాకర్, నెల్లూరు ఏ.డి శ్రీనివాసరావుతో పాటు ఆర్డీఓ ఉమాదేవి, డిఎస్పీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు రూరల్‌లో

## వైసిపిలోకి వలసలు!



వైసిపిలో చేరిన తెదేపా మాజీ కార్పొరేటర్లతో వైకాపా నాయకులు

నెల్లూరురూరల్‌లో తెలుగుదేశం పార్టీకి సరైన నాయకత్వం లేకుండా పోయింది. రూరల్‌కు సంబంధించి గట్టి నాయకులంతా వైసిపిలో వుండడం, నిన్నటి ఎన్నికల్లో నెల్లూరు రూరల్ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అబ్దుల్ అజీజ్ ఆ తర్వాత రూరల్‌ను పెద్దగా పట్టించుకోకపోవడంతో టిడిపి నాయకులు వైసిపి వైపు చూస్తున్నారు. ఈ పరంపరలోనే ఇటీవల ఆ పార్టీ మాజీ కార్పొరేటర్లు దాసరి రాజేష్, మల్లిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, నాయకులు పావల్ల ప్రసాద్, దారా వంశీలు నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. త్వరలోనే ఇంకొందరు నాయకులు కూడా వైసిపిలో చేరనున్నట్లు తెలుస్తోంది.





అమ్మవారి గర్భాలయానికి అమర్చిన స్వర్ణ తాపడాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనిల్, ఎమ్మెల్యే కిలివేటి, నంబూరు మోహన్‌రావు, మనోజ్

# స్వర్ణ మంజరి... చెంగాళమ్మ పరమేశ్వరి

- నంబూరు కుటుంబసభ్యులు భక్తితో సమర్పించుకున్న గర్భాలయ స్వర్ణతాపడాన్ని ఆవిష్కరించిన మంత్రి అనిల్
- స్వర్ణ కాంతులతో శోభిల్లుతున్న చెంగాళమ్మ ఆలయ ప్రాంగణం

ఒకసారి దర్శించుకుంటే మళ్ళీ మళ్ళీ దర్శించుకోవాలనేంత దివ్యమహిమాన్వితురాలు సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు. ఆ తల్లి చల్లని దీవెన కోసం నిత్యం వేలాదిమంది భక్తులు పోటెత్తినట్లు వస్తుంటారు. అమ్మవారి కరుణాకటాక్షాలు పొందుతుంటారు. అమ్మవారిని తమ ఇంటి దైవంగా భావిస్తుంటారు. అలా అమ్మవారిని తమ ఇష్టదైవంగా భావిస్తున్నవారే దేశంలోనే ప్రసిద్ధిగాంచిన గృహనిర్మాణ సంస్థ అలయన్స్ గ్రూప్ అధినేత నంబూరు మనోజ్ కుటుంబసభ్యులు. చెంగాళమ్మ పరమేశ్వరి అంటే ఆ కుటుంబసభ్యులకు భక్తి విశ్వాసాలు అపారం. ఆ తల్లి మీద భక్తితో గతంలో ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన భవనాన్ని నిర్మించిన ఆ కుటుంబ సభ్యులు తాజాగా భారీ వ్యయంతో అమ్మవారి గర్భాలయానికి స్వర్ణ కాంతులు అద్దుతూ స్వర్ణ తాపడం చేయించారు. ఈ నెల 2వ తేదీన తొలి శ్రావణ శుక్రవారం రోజున రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా గర్భాలయ స్వర్ణ తాపడాన్ని ఆవిష్కరించారు. మంత్రి అయ్యాక తొలిసారి ఆలయానికి విచ్చేసిన అనిల్‌కు స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం లభించింది. స్వర్ణతాపడం సమర్పకులు నంబూరు మోహన్‌రావు – శ్రీమతి సులోచన, నంబూరు మనోజ్ – లత దంపతులు ఉభయకర్తలుగా ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గోపూజ, చండీహోమం, పుష్పయాగాలను కనుల పండువగా నిర్వహించారు.

ఆలయ మాజీఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డి ఈ వేడుకలను పర్యవేక్షించగా శ్రీసిటీ యం.డి రవి సన్నారెడ్డి, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరు మహేష్‌రెడ్డి తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

**సరికొత్త శోభ :** గర్భాలయానికి స్వర్ణతాపడంతో అమ్మణ్ణి ఆలయం ధగధగా మెరిసిపోతోంది. గర్భాలయం సరికొత్త కళను సంతరించుకుంది. భక్తులు కూడా అమ్మవారి దర్శనంతో పాటు స్వర్ణ తాపడం కాంతులను ప్రత్యేకంగా చూస్తుండడం విశేషం.

# సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లే కీలకం

**- ఆనం రామనారాయణరెడ్డి**

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పేదలందరికి చేర్చడంలో గ్రామవాలంటీర్లే కీలకపాత్ర పోషించాలని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. 8వ తేదీ కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 20 గ్రామ పంచాయితీలకు చెందిన 212 మంది గ్రామ వాలంటీర్లకు శిక్షణ అనంతరం నియామక ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో మొత్తం 1545 మంది వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వై.యస్.రాజశేఖరరెడ్డి పరిపాలనను మరపించే తరహాలో పరిపాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని, గ్రామ వాలంటీర్లు సేవాదృక్పథంతో పని చేయాలని కోరారు. వైసిపి నాయకులు చెన్ను బాలకృష్ణారెడ్డి, కె.రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

# నగరంలో ట్రాఫిక్ కౌన్సిలింగ్ సెంటర్



కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

నెల్లూరు నగరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కౌన్సిలింగ్ సెంటర్‌ను 6వ తేదీ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ అనేకమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అలాంటి వారిలో మార్పు తేవడమే కౌన్సిలింగ్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై జరిమానాలు విధించడం తమ లక్ష్యం కాదని, ప్రమాదాలు నివారించి ప్రాణాలు కాపాడాలన్నదే తమ తపన అని అన్నారు. చిన్నచిన్న ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చున్నారు.

ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ మల్లిఖార్జునరావు, ట్రాఫిక్ సి.ఐలు మధుబాబు, ఆంజనేయరెడ్డి, ఎస్.ఐలు పాల్గొన్నారు.

**సువిధ రెస్ట్‌హౌస్ ప్రారంభం...**

అలాగే పాత జిల్లా పోలీస్ కార్యాలయంలో 50 పడకలతో ఏర్పాటు చేసిన సువిధ రెస్ట్‌హౌస్‌ను కూడా ఎస్పీ ప్రారంభించడం జరిగింది.

# జిల్లా పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుడదాం

## రాష్ట్ర మంత్రి మేకపాటిని కలిసిన శ్రీసిటీ ఎం.డి



శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల నెల్లూరులో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో కలిసిన రవీంద్ర సన్నారెడ్డి శ్రీసిటీ పారిశ్రామికవాడకు రావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి తదితర అంశాలపై వారు చర్చించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు.

# కామాక్షమ్మకు స్వర్ణ చంద్రహారం

## సమర్పించుకున్న ఎమ్మెల్యే ప్రసన్న దంపతులు



జొన్నవాడలోని భక్తుల ఇలవేల్పు శ్రీ కామాక్షితాయి అమ్మవారికి కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, గీత దంపతులు స్వర్ణ చంద్రహారం సమర్పించారు. 7వ తేదీ ఆలయ ఇ.ఓకు ఈ చంద్రహారాన్ని అందజేశారు. ప్రసన్న దంపతులు, వారి కొడుకు రజిత్‌రెడ్డి, కోడలు పూజ, ప్రసన్న సోదరులు రాజేంద్రనాథ్‌రెడ్డి, జగదీష్‌కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డిలు కూడా ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఇ.ఓ కృష్ణారెడ్డి, అర్చకులు ప్రసన్న కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పట్టువస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో బుచ్చి తహశీల్దార్ మల్లిఖార్జునరావు, వైసిపి నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, చీమల రమేష్‌బాబు, ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు క్లబ్‌కు కొత్త సారధ్యం

## అధ్యక్షుడిగా పాలిచర్ల ఫణిప్రసన్నరెడ్డి, కార్యదర్శిగా ఇసనాక సునీల్‌రెడ్డి

నెల్లూరు నగరంలో ఎంతో చరిత్ర కలిగింది నెల్లూరు క్లబ్. ఎందరో ప్రముఖులు గతంలో ఈ క్లబ్‌కు సారధ్య బాధ్యతలు వహించి వున్నారు. ఈ క్లబ్‌కు అధ్యక్షుడు, కార్యదర్శిగా పనిచేయడమంటే ఎమ్మెల్యే, ఎంపి పదవులను నిర్వహించినంత ప్రతిష్టాత్మకంగా ఉంటుంది. ఈ క్లబ్‌కు ఎలక్షనంటే అసెంబ్లీ ఎలక్షన్ మాదిరిగానే టెన్షన్ ఉంటుంది. రెండేళ్లకోసారి క్లబ్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీ! ఎంతో ప్రతిష్టాత్మకమైన నెల్లూరు క్లబ్‌కు ఈసారి ఎన్నికలు లేకుండానే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. క్లబ్‌కు నూతన అధ్యక్షులుగా పాలిచర్ల ఫణిప్రసన్నరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇసనాక సునీల్‌రెడ్డి, కార్యదర్శిగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా ఎ.పూర్ణచంద్రరావు, కార్యనిర్వాహక కమిటి సభ్యులుగా డాక్టర్ డి.నారాయణరెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, యం.విజయకుమార్ రెడ్డి, ఎస్.అశోక్‌బాబు, ఎస్.దయాకర్‌రెడ్డి, ఎస్.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి 'లాయర్' అభినందనలు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## 'ప్రభా'తం

# కశ్మీర్ కన్నుల్లో.. ఆనంద భాష్పాలు

**జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణానికి కేంద్రప్రభుత్వం ముగింపు పలకడం చరిత్రాత్మకమైన నిర్ణయం. దీంతో ప్రత్యేక రాజ్యాంగం, అధికారాలు రద్దు కావడంతో జమ్ముకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైంది. ఇన్నేళ్ళుగా ఆ రాష్ట్రానికున్న సంకెళ్ళు విడిపోయినట్లయింది. ఏళ్లతరబడి అక్కడి ప్రజలు పడుతున్న బాధలకు విముక్తి కలిగినట్లయింది. ప్రధాని మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేతమైన ఈ నిర్ణయానికి దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి.**

*"ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఓ చరిత్రాత్మక ఘట్టం. స్వార్థపరశక్తుల సంకెళ్ళ నుంచి విముక్తి పొందిన జమ్ముకశ్మీర్‌కు నవోదయం. మనం కలిసే ఉన్నాం..కలిసే ఎదుగుదాం. 140 కోట్ల మంది భారతీయుల కలలను సాకారం చేద్దాం. తమ స్వార్థప్రయోజనాల కోసం భావోద్వేగాలతో ప్రజలను రెచ్చగొట్టి ఏళ్ళతరబడి పబ్బం గడుపుకుంటున్న స్వార్థపరశక్తులు..ఏరోజూ ప్రజల సాధికారత గురించి గానీ, ప్రజల సంరక్షణ గురించి గానీ పట్టించుకోలేదు. జమ్ముకశ్మీరుకు ఇప్పుడు..వారి సంకెళ్ళ నుంచి విముక్తి లభించింది. అక్కడి ప్రజలకు ఇప్పుడిది సరికొత్త ఉషోదయం"* *- ప్రధాని మోడీ!..*

ఔను!...ఇన్నాళ్ళకి..ఇన్నేళ్లకి...సుమారు 70 ఏళ్ళ తర్వాత కశ్మీర్ కన్నుల్లో ఇప్పుడు ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఇక తమ జీవితాల్లో వెలుగులు ఉండనే ఉండవనుకుంటూ ఏళ్ళతరబడి నిరాశామయ జీవితాలను సాగిస్తూ...ఎలాంటి భద్రత కానీ, అభివృద్ధి కానీ లేక బతకలేక బతుకుతున్న ప్రజలందరికీ ఇది ఖచ్చితంగా..నవోదయమే!.. ఎప్పుడూ దాడులతో మారణహోమాలతో భయపెట్టే ఉగ్రవాదోన్మాదుల దుశ్చర్యలతో అనుక్షణం.. క్షణమొకయుగంగా భయంభయంగా గడుపుతున్న జమ్ము కశ్మీర్ ప్రాంతాల్లోని ప్రజల వదనాల్లో ఇప్పుడు చిరునవ్వులు మెరుస్తున్నాయి. సుందర కశ్మీరం వదనంలో ఇప్పుడు దరహాసం వెల్లివిరుస్తోంది. అన్ని సమస్యలకు నిలయంగా, అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచిన ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సంచలనాత్మక నిర్ణయాలే ఇందుకు కారణం. ఎవరూ ఊహించని విధంగా.. ఎంతో వ్యూహాత్మకంగా అడుగులు వేసి, ఏళ్ళ తరబడిగా జమ్ము కశ్మీర్‌ను వేధిస్తున్న సమస్యలకు సంబంధించిన ఎంతో క్లిష్టమైన అంశాలను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగడం.. నిజంగా ఒక అద్భుతమే!..మరోవైపు పాక్ నుంచి బెదిరింపులు, ఇతరత్రా విమర్శలు ఎడతెరపిలేకుండా వస్తున్నా దేనికీ బెదరకుండా జమ్ముకశ్మీర్ విషయంలో కేంద్రం తిరుగులేని నిర్ణయాలు తీసుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మోడీ ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక..సాహసోపేతమైన నిర్ణయం.

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణానికి కేంద్రప్రభుత్వం ముగింపు పలకడంతో ఇప్పుడు ఆ రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం, అధికారాలు రద్దు కావడంతో జమ్ముకశ్మీర్‌కు ఇన్నేళ్ళుగా ఉన్న సంకెళ్ళు విడిపోయినట్లయింది. జమ్ముకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైంది. దీంతో భారతీయుల హృదయాల్లో ఆనందం వెల్లువెత్తింది. అసలు, ఆర్టికల్ 370ని అచేతనం చేస్తున్న తీర్మానం గురించి ప్రకటించగానే ఆయా ప్రాంతాల్లోని ప్రజలంతా ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకున్నారంటే వారు ఇంతకాలం ఎంత బాధలు అనుభవిస్తున్నారో తేటతెల్లమవుతుంది. ఇన్నేళ్ళుగా అక్కడ ఎన్నో బాధలు పడుతూ జీవితాలను అభద్రతలో గడుపుతున్న కశ్మీరీ పండితులైతే ఇన్నాళ్ళకి తమ జీవితాలకు వెలుగుదారులు పరిచే రోజులొచ్చాయంటూ ఆనందపడిపోతున్నారు. తాము తిరిగి కశ్మీర్ లోయకు వెళ్లేందుకు మోడీ ప్రభుత్వం బాటలు వేస్తుందని వారు దృఢంగా విశ్వసిస్తున్నారు కూడా. కశ్మీర్‌ను ఎంతోకాలంగా వేధిస్తున్న.. ఎంతో క్లిష్టమైన.. ఎన్నో సవాళ్ళతో కూడుకున్న ఈ సమస్యని ఎవరూ ఊహించని విధంగా పరిష్కరిస్తూ మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా, జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణాన్ని రద్దుచేయడంతో భారత రాజ్యాంగంలోని నిబంధనలన్నీ సంపూర్ణంగా జమ్ముకశ్మీర్‌కు కూడా వర్తింపజేసేందుకు వీలు కలిగింది. జమ్ముకశ్మీర్‌కు మిగతా దేశానికి మధ్య దాదాపు 70 ఏళ్ళుగా..అడ్డుగోడలాగా ఉన్న ఆర్టికల్ 370ని అడ్డం పెట్టుకుని వేర్పాటువాదులు తమకు ప్రత్యేక అధికారాలున్నాయని చెప్పుకుంటూ తాము భారతదేశంలో భాగం కాదనే భావనను ప్రజల్లో ఎంతోకాలంగా రగులుస్తూ రెచ్చగొట్టేవారు. ఇదే అదనుగా సీమాంతర ఉగ్రవాదులు అక్కడ ఇనుపడేగల్లా వాలిపోయి, దాడులతో ప్రజల్ని భీతావహుల్ని చేస్తూ.. చల్లటి అందాల లోయగా ఉన్న కశ్మీర్‌ను అగ్నిగుండంగా మార్చివేశారు. జమ్ము కశ్మీర్ సమస్యతో 1959 నుంచి ఇప్పటిదాకా 41, 839 మంది ప్రాణాలు కోల్పోయారని, ఆర్టికల్ 370 లేకుంటే ఇంతమంది ప్రాణాలు కోల్పోయే అవసరం ఉండేది కాదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గణాంకాలతో సహా వివరించారు కూడా. ఈ భయంకర ఉగ్రవాదం కారణంగా ప్రజలు జమ్ముకశ్మీర్ ప్రాంతాలకు వెళ్ళేందుకే భయపడే పరిస్థితులు దాపురించాయి. ఎలాంటి అభివృద్ధీ లేక, బతుకు తెరువు కూడా దొరక్క యువత అసంతృప్తితో ఉంటూ పెడదారులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో భారత రాజ్యాంగంలోని నిబంధనలన్నీ సంపూర్ణంగా జమ్ముకశ్మీర్‌కు కూడా వర్తింపజేసేందుకు వీలు కలిగింది. ఈ చర్యతో రాష్ట్ర అసెంబ్లీకి ఇచ్చిన 35-ఏ అధికరణ కూడా అచేతనావస్తకు చేరుకుంది. భారత రాష్ట్రపతి కూడా ఉత్తర్వులు జారీ చేయడంతో జమ్ము కశ్మీర్ పూర్తిగా భారత రాజ్యాంగపరిధిలోకి వచ్చింది. జమ్ము కశ్మీర్ శాసనసభ కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా, లద్దాఖ్ శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించింది. 370 ఆర్టికల్ రద్దుతో జమ్ముకశ్మీర్ కూడా దేశంలోని మిగతా రాష్ట్రాల మాదిరిగా దేశంలో ఒకభాగంగా మారిపోయింది. మొత్తమ్మీద ఇన్నేళ్ళుగా అసంపూర్తిగా ఉన్న కశ్మీర్ విలీనం ఇప్పుడు పరిపూర్ణం కావడంతో జమ్ము కశ్మీర్ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైనట్లయింది. దీంతో పాక్ నుంచి బెదిరింపులు ప్రారంభమైనా, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె) కూడా భారత్‌లో అంతర్భాగమని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధమని అమిత్‌షా తాజాగా ప్రకటించడం మరో సంచలనమైంది. ఏదేమైనా.. సుదీర్ఘకాలం నుంచి కలలు కంటున్న 'ఒకే దేశం..ఒకే జెండా' విధానం ఇప్పుడు పూర్తిస్థాయిలో అమల్లోకి రావడం పట్ల దేశంలో సర్వత్రా సంతోష సంరంభాలు వెల్లువెత్తుతున్నాయి.

# జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్లీనరీ మహాసభలు

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్లీనరీ మహాసభలు ఈనెల 10 నుంచి రెండురోజుల పాటు నెల్లూరు లోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని, ఈ సభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ కోరారు. ఈనెల 4న నెల్లూరు హరనాథపురంలోని జేవీవీ జిల్లా కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి జిలాని మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, సైన్సు ఫలాలు అందరికి దక్కాలనే నినాదంతో పని చేస్తున్నామన్నారు. మహాసభల రోజు కళ్లకు గంతలు కట్టుకుని బైక్ నడపడం, సలసల కాగుతున్న వేడి నూనె లోంచి చేతితోనే బజ్జీలు తీయడం, అగ్నిగుండం తొక్కడం లాంటి కార్యక్రమాలు చేసి వీటిల్లో మాయలు, మంత్రాలు లేవని చెబుతామన్నారు. సర్వ మానవ శ్రేయస్సును కోరే సైన్సును మాత్రమే తాము ప్రచారం చేస్తామన్నారు. నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ్, పోతంశెట్టి విద్యాచరణ్, డాక్టర్ శ్రీనినాయక్, డాక్టర్ ఖాదర్ బాషా, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పినాకిని పార్కులో వ్యాయామశాల



రూప్‌కుమార్‌ను సన్మానిస్తున్న వ్యాయామశాల యాజమాన్యం

నెల్లూరు 51వ డివిజన్ పెన్నానదీ తీరాన వున్న పినాకినీ పార్కులో ఏర్పాటు చేసిన హనుమాన్ వ్యాయామశాలను ఈనెల 4న మాజీ కార్పొరేటర్ పి.రూప్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జల వనరులశాఖామంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వ్యాయామశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశామన్నారు. పార్కుతో పాటు వ్యాయామశాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. పినాకినీ పార్కులో మరికొన్ని వసతుల కల్పించేందుకు మంత్రి దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కొణిదల సుధీర్, దార్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




## రెండు నెలల్లోనే చెప్పేస్తారా?

జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ రెండు నెలల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఎన్నో హామీలను ఆయన అమలులోకి తెచ్చారు. అయితే కొన్ని నిర్ణయాల మీద అప్పుడే కొందరు పెదవి విరుస్తున్నారు. జగన్ పాలన బాగాలేదంటూ నిరుత్సాహం చెందుతున్నారు. శ్రీరామచంద్రుడే ఇప్పుడు వచ్చి దేశాన్ని పరిపాలించినా నూటికి నూరు శాతం మంది సంతృప్తి చెందరు. లోకం అలా తయారైంది. వై.యస్.రాజశేఖరరెడ్డి 5ఏళ్లే పరిపాలించినా ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అలాంటి నాయకుడే తొలి ఏడాది ఎన్నో ఒడిదుడుకులనెదుర్కొన్నాడు. జగన్ పరిపాలన ఇంకా ట్రాక్ ఎక్కలేదు. అప్పుడే అసంతృప్తి వ్యక్తం చేస్తే ఎలా?

**సి.వి.పాండురంగారెడ్డి, నెల్లూరు.**

## స్పీకర్ అంటే అలా ఉండాలి

కర్నాటక మాజీస్పీకర్ కె.ఆర్.రమేష్‌కుమార్ తన పరిధిలో రాజ్యాంగ విలువలను కాపాడి చరిత్రలో నిలిచిపోయారు. పార్టీ విప్‌లను ధిక్కరించిన 17మంది ఎమ్మెల్యేలను వచ్చే ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేసి స్పీకర్ పదవికి వున్న ఔన్నత్యాన్ని కాపాడారు.

**– కొల్లూరు పురుషోత్తం, చిత్తూరు.**

## పిచ్చి భక్తి పనికిరాదు

మన దేశంలో ఏదొచ్చినా వేలం వెర్రిగానే వుంటుంది. మరీ భక్తి విశ్వాసాలు శృతిమించుతున్నాయి. గోదావరి పుష్కరాలు అంటే అక్కడ మునగకపోతే పాపం చేసినట్లవుతుందేమో అన్నట్లు గుంపులు గుంపులుగా పోయి మునుగుతారు. ఇప్పుడు కంచిలో అత్తివరదరాజ స్వామి దర్శనం కోసం రోజుల తరబడి క్యూలలో వుంటున్నారు. వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. 40ఏళ్ల క్రితం చాలా సాధారణంగా అత్తి వరదరాజ స్వామి దర్శనం జరిగి వుంటుంది. ఇప్పుడు సోషల్ మీడియా ప్రభావంతో దేశవ్యాప్తంగా భక్తులు కంచికి పోటెత్తారు. తొక్కిసలాటలో కొంతమంది చనిపోయారు కూడా!

**రావూరు శ్యామల, ఆత్మకూరు.**

## ఎస్పీ పనితీరు బాగుంది

లంచం అడిగితే వారిపై లాఠీ వేటు తప్పదని ప్రకటించిన జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి పనితీరు ప్రశంసనీయం. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి జిల్లాలో పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారు. ఎస్పీ స్థాయి నుండి సాధారణ కానిస్టేబుల్ స్థాయి వరకు అందరూ అవినీతికి దూరంగా వుండాలని పోలీస్‌స్టేషన్లకు వివిధ పనులపై వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగాలని బాధితులకు అండగా నిలిచి వారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పని చేయాలని పోలీసు శాఖకు ఎస్పీ దిశానిర్దేశం చేస్తున్నారు. సంఘ వ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు తీసుకొంటూ జిల్లాను నేరరహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించే సందర్భంలో వారి పట్ల ఎంతో గౌరవభావం చూపుతూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నారు.

**డా॥ యస్.బాబురావు, కావలి.**




నూరవ ట్రైన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆల్‌స్టామ్ ప్రతినిధులు

## మేక్ ఇన్ ఇండియాకు ప్రతీకగా...

# ఆల్‌స్టామ్ నుండి మరో మెట్రో ట్రైన్

శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ పరిశ్రమ ప్రధాని నరేంద్రమోడీ మేక్‌ఇన్ ఇండియా కలలకు ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇక్కడ తయారు చేయబడుతున్న మెట్రో కోచ్‌లను ఆస్ట్రేలియా వంటి దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ఈ పరంపరలోనే ఆల్‌స్టామ్ పరిశ్రమ నుండి 100వ మేక్ ఇన్ ఇండియా మెట్రో ట్రైన్ ఈ నెల 5వ తేదీ విడుదలైంది. కొచ్చి మెట్రో రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఈ ట్రైన్‌ను అందజేశారు. ఆల్‌స్టామ్‌కు ఇది 100వ ట్రైన్‌కాగా కొచ్చి మెట్రో సంస్థకు ఇది 25వ మెట్రో ట్రైన్ కావడం విశేషం. ఈ సందర్భంగా ఆల్‌స్టామ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆల్‌స్టామ్ ఇండియా మరియు సౌత్‌ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అలైన్‌స్పోర్, కొచ్చి మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నతాధికారులు రాజేంద్రన్, సిన్హాలు లాంఛనంగా జెండా వూపి ఈ ట్రైన్ సెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అలైన్ స్పోర్ మాట్లాడుతూ ఈ వందో మెట్రో సెట్ విడుదల ద్వారా ఒక మైలురాయిని దాటామన్నారు. మా సంస్థ శక్తి సామర్ధ్యాలకు ఇది కొలమానమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సంస్థకున్న 4200 మంది ఉద్యోగుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దృష్టి కోణానికి తగినట్లు తమ వ్యాపార లక్ష్యాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో ఆల్‌స్టామ్ మొదటి గ్లోబల్ ఉత్పత్తి కేంద్రాన్ని 2013 నవంబర్‌లో శ్రీసిటీలో ప్రారంభించామని, 2014 ఫిబ్రవరిలో మొదటి మెట్రో ట్రైన్ సెట్‌ను చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్‌కు అందజేశామన్నారు. భవిష్యత్‌లో తమ సంస్థ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకుంటామని చెప్పారు.

## సినిమా... పర్యాటకం...

# నెల్లూరుజిల్లా ఎంతో అనుకూలం









**రాష్ట్ర విభజన జరిగి 5 ఏళ్ళు దాటిపోయింది. పదేళ్ళ ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను వదిలేసి ఆంధ్రా పాలకులు అమరావతికి వచ్చేయడం జరిగింది. ఇక మన ఆంధ్రప్రదేశ్ – మన అభివృద్ధి అనేది మన నినాదం కావాలి. ఈరోజు హైదరాబాద్ దేశంలోనే టాప్ నగరాలలో ఒకటిగా అభివృద్ధి చెందిందంటే దానిలో రెండు ప్రధాన కారణాలను ప్రస్తావించవచ్చు. ఒకటి టూరిజం, రెండోది సినీ పరిశ్రమ. హైదరాబాద్‌ను ఈరోజు ప్రపంచ పటంలో నిలబెట్టడంలో వీటి పాత్రను కొట్టిపారేయలేము.**

ఈ రెండు రంగాలతో ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. సినీ పరిశ్రమతో నగరానికి ఎప్పుడూ గ్లామర్ వుంటుంది. ఇప్పుడు హైదరాబాద్ మనది కాదు. కాని అక్కడవున్న తెలుగు సినీ పరిశ్రమలో 95శాతం ఆంధ్రులే! అక్కడ వున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు రాలేకపోతోంది. ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమ చెన్నై కేంద్రంగా వుండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా మూడు దశాబ్దాలకుపైగా చెన్నైలోనే వుండిపోయింది. స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రి అయ్యాక చెన్నై నుండి తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలించడంలో కీలకపాత్ర పోషించారు. సినీ పరిశ్రమ వచ్చాక హైదరాబాద్ కొత్త గ్లామర్ సంతరించుకుంది. ఈ రంగంలోని తెలుగు కళాకారులకు, కార్మికులకు అవకాశాలొచ్చాయి. స్టూడియోలు వెలిశాయి. స్టార్ హోటళ్ళు పెరిగాయి.

ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగాక కూడా సినీ పరిశ్రమ హైదరాబాద్‌లోనే వుండిపోయింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సినీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలన్న ప్రయత్నాలకు కొందరు ప్రముఖులే గండికొట్టారు. వీరంతా కూడా హైదరాబాద్‌లో వందలు, వేల కోట్లల్లో ఆస్తులు పోగేసుకుని వున్నారు. సినీ నిర్మాత డి.సురేష్‌లాంటి వాళ్ళు మాత్రం అప్పుడే సినీ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తరలించే ఆలోచన చేశారు.

తెలుగుదేశం ప్రభుత్వంలో అది సాధ్యం కాలేదు. ఇప్పుడు సీఎం జగన్ దీనిపై దృష్టి పెడితే తెలుగు సినీ పరిశ్రమను పూర్తి స్థాయిలో కాకున్నా పాక్షికంగానైనా ఏపికి తరలించవచ్చు. ఇప్పుడు పునాది వేస్తే కనీసం ఇంకో పదేళ్ళకైనా ఏపి కేంద్రంగా సినీ పరిశ్రమ వేళ్ళూనుకుంటుంది.

### నెల్లూరుకు అన్నీ వున్నాయి...

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి నెల్లూరు, చిత్తూరుజిల్లాలు ప్రధాన కేంద్రాలుగా ఉపయోగపడతాయి. కొన్నేళ్ల క్రితం సినీ నిర్మాత డి.సురేష్ ఇదే విషయాన్ని ప్రకటించివున్నారు. ఈ రెండు జిల్లాల్లో సినిమాలు తీయడానికి కావాల్సిన అన్ని హంగులున్నాయి. ఎయిర్‌పోర్టు, సీపోర్టు, జాతీయ రహదారులు, ఇండస్ట్రీస్ హబ్‌లు, కొండలు, వాగులు, జలపాతాలు, సరస్సులు, సముద్ర తీరం, జాతీయ రహదారి, ప్రసిద్ధ దేవాలయాలు... ఎన్ని కావాలో అన్నీ వున్నాయి. మంచి షూటింగ్ స్పాట్‌లకు కొరతలేదు. అన్నింటికి మించి చెన్నై దగ్గర. టెక్నీషియన్‌లకు గాని, ల్యాబ్‌లకు గాని, స్టూడియోలకు గాని ఇబ్బంది లేదు. సినీస్టార్‌లకు కూడా స్టార్ హోటల్స్‌లో బస చేయాల్సిన పని లేదు. చెన్నై నుండి దగ్గర కాబట్టి షూటింగ్ స్పాట్‌లకు రోడ్డు మార్గాన వచ్చిపోతుండవచ్చు. అతి తక్కువ ఖర్చుతో సినిమాలను పూర్తి చేయొచ్చు.

నెల్లూరుజిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలున్నాయి. ఇటీవలే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో చెన్నైలోని విజిపి గార్డెన్స్ యాజమాన్యం పులికాట్‌లోని ఇరకం దీవిని సందర్శించడం, ఇరకంను పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపుతుండడం ఎంతైనా ఆశాజనక పరిస్థితి. జిల్లాలో టూరిజాన్ని, అదే క్రమంలో సినీ రంగపరిశ్రమను అభివృద్ధి చేయగలిగితే నెల్లూరు జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి వైపు పయనిస్తుంది.



# సీట్లున్నా.. చేరేవాళ్లేరి?


## బోసిపోతున్న... ఇంజనీరింగ్ కళాశాలలు

దాదాపు పద్దెనిమిదేళ్ల క్రితం... ఇప్పుడు ఉపరాష్ట్రపతి, అప్పుడు కేంద్రమంత్రిగా వున్న యం.వెంకయ్యనాయుడు జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొని తన ప్రసంగంలో ఓ మాట చెప్పారు. భవిష్యత్‌లో ఎఫ్‌సిఐకి గాని సివిల్ సప్లయిస్ శాఖకు గాని కొత్తగా గోడౌన్‌లు కట్టాల్సిన అవసరముండదని, ఇప్పుడున్న ఇంజనీరింగ్ కాలేజీలే అప్పటికి గోడౌన్‌లుగా ఉపయోగపడతాయని చమత్కరించారు. ఆయన దూరదృష్టితో చెప్పిన మాట ఈరోజు అక్షరాలా నిజమవుతోంది. మరి ఈ ఇంజనీరింగ్ కాలేజీలన్నీ కూడా నేరుగా గోడౌన్‌లు అవుతాయని చెప్పలేం గాని పరిస్థితులు మాత్రం అంత దరిద్రంగా వున్నాయి.

గత కొన్నేళ్లుగా సీట్లు భర్తీ కాక ఇంజనీరింగ్ కాలేజీలు వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది కూడా పరిస్థితిలో మార్పు లేదు. ఈ ఏడాది ఇంజనీరింగ్ తొలి విడత కౌన్సిలింగ్ పూర్తయ్యింది. గత ఏడాదికంటే కూడా అడ్మిషన్లు దారుణంగా వున్నాయి. జిల్లాలో మొత్తం 22 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఈ కాలేజీలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కలిసి 10,500 సీట్లున్నాయి. గత ఏడాది 8వేల సీట్లే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది జిల్లా నుండి 15వేల మంది ఇంజనీరింగ్‌కు అర్హత సాధించారు. అయితే ఎక్కువ శాతం మంది విద్యార్థులు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరడానికి మొగ్గుచూపుతుండడంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు. నెల్లూరు జిల్లాలో పది కళాశాలల్లో సీట్లకు మాత్రమే డిమాండ్ ఉంది. కొన్ని కళాశాలల్లో అయితే అడ్మిషన్లు మరీ ఘోరంగా వుంటున్నాయి. తొలివిడతలో జిల్లాలోని అన్ని కళాశాలల్లో కలిపి 3,408సీట్లు భర్తీ అయ్యాయి. కొన్ని కళాశాలల్లో అడ్మిషన్‌లు సింగిల్ డిజిట్‌లోనే వున్నాయి. రెండో విడత కౌన్సిలింగ్‌లో ఎన్ని సీట్లు భర్తీ అవుతాయో తెలియని పరిస్థితి. గత ఏడాది జిల్లాలో అన్ని కాలేజీలలో కలిపి 3500 సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది అంతకంటే ఎక్కువ సీట్లే మిగిలిపోయే వాతావరణం కనిపిస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రెండు మూడేళ్లలో కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల భవనాలను గోడౌన్‌లుగా మార్చుకోక తప్పదేమో?!

## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి...

# 16న పుష్పయాగం



సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 16వతేదీ రాత్రి 7గంటలకు అమ్మవారికి పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 2 నుండి శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రతి మంగళ, శుక్రవారాల్లో పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకి సేవ తదితర పూజాది కార్యక్రమాలను, ప్రతి శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఇఒ కెపివి ప్రసాద్, ఛైర్మన్ ఓ.సుధాకర్‌యాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

# నెల్లూరు కబుర్లు

## హోంమంత్రిని కలిసిన
## కలెక్టర్, ఎస్పీ



జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఈ నెల 3న నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరితను జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగిలు పినాకిని అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో పరిస్థితుల గురించి ఆమె వారినడిగి తెలుసుకున్నారు.

## రైల్వేస్టేషన్ వద్ద
## నూరు అడుగుల స్థంభం



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పడమర వైపున నూరు అడుగుల భారీ స్థంభాన్ని ఏర్పాటు చేశారు. మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇక్కడ భారీ జాతీయ పతాకం ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి మువ్వన్నెల జెండా రెపరెపలు నగరంలో ఎక్కడ భవనాలు ఎక్కినా కనిపించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ వద్ద ఇదే రీతిలో జాతీయ పతాకం రెపరెపలాడుతుంటుంది. అంతెందుకు మన జిల్లాలోనే బుచ్చి మండలం కాగులపాడు వద్ద ప్రియా సిమెంట్స్ అధినేత నెల్లూరు రాధాకృష్ణారెడ్డి దాతృత్వంతో నిర్మించిన హైస్కూల్‌లోనూ ఇదే రీతిలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకం ఆ చుట్టుపక్కల గ్రామాలలోనూ కనిపిస్తుంది. త్వరలో భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు చేతులమీదుగా ఈ భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

## డా. కిషోర్స్ రత్నం కిడ్స్ స్కూల్‌లో
## 'రెడ్ స్ప్రింగ్స్ దినోత్సవం



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఇటీవల రెడ్‌స్ప్రింగ్స్ దినోత్సవం జరిగింది. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ఎరుపు రంగు పదార్థాలను సేకరించారు. ఫ్లెక్లాస్ విద్యార్థులు విభిన్నమైన రీతుల్లో ఎరుపు రంగు ప్రాధాన్యతను గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్, రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబి స్పెషల్ ఆఫీసర్‌గా
## కలెక్టర్ శేషగిరిబాబు

ఇప్పటికే నెల్లూరు నగరపాలక సంస్థకు, జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుపై మూడో బాధ్యత కూడా పడింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం పదవీ కాలం గత నెలాఖరుతో ముగిసింది. సొసైటీలకు త్రిసభ్య కమిటీలను వేస్తారన్న ప్రచారం వుంది. అయితే దీనికి సంబంధించి ఇంత వరకు జి.ఓ రాలేదు. అంతవరకు కూడా జిల్లా కలెక్టర్‌నే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రత్యేక అధికారిగా నియమించారు.

## సీఎం భద్రతాధికారిగా
## పరమేశ్వరరెడ్డి



పరమేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎస్పీ రస్తోగి

జిల్లా ఏఎస్పీగా పనిచేస్తూ గత నెల 6వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి అటాచ్ చేయబడిన పి.పరమేశ్వరరెడ్డిని సీఎం చీఫ్ సెక్యూరిటీ అధికారిగా నియమిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరుకు ఏసిబి డిఎస్పీగా వచ్చిన పరమేశ్వరరెడ్డి గత ఏడాది ఆగస్టులో పదోన్నతి ద్వారా జిల్లా పరిపాలన విభాగం ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కొద్ది కాలంలోనే పోలీసుశాఖలో మంచి పేరు తెచ్చుకున్నారు. జూలై 6వ తేదీ ఆయనను విజిలెన్స్ విభాగానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినా అది పెండింగ్‌లోనే వుండిపోవడంతో ఆయన ఏఎస్పీగానే కొనసాగుతున్నారు. ఇప్పుడు సీఎం సెక్యూరిటీ విభాగానికి బదిలీ అయ్యారు.

## పండ్ల రసాలు కాదు...
## కుళ్ళు రసాలు



ఇటీవల హోటళ్లపై విస్తృతంగా దాడులు నిర్వహించి అక్కడ ఆహార పదార్థాలు ఎంత అధ్వాన్న స్థితిలో నిల్వ వుంచుతున్నారో బయటపెట్టిన మున్సిపల్ హెల్త్ మరియు ఆహార కల్తీ నియంత్రణ శాఖాధికారులు 5వ తేదీ నగరంలోని పలు పండ్ల రసాలు అమ్మే సెంటర్‌లలో కూడా తనిఖీలు చేపట్టారు. విఆర్‌సి సెంటర్‌లోని వైయస్‌ఆర్ కూల్‌డ్రింక్స్, సిమ్లా ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించగా, కుళ్లిపోయిన పండ్లతో జ్యూస్‌ను తయారుచేయడం బయటపడింది. జ్యూస్‌లో ఈగలు పడివుండడం, కుళ్లిన పండ్లను చూసి అధికారులే నివ్వెరపోయారు. ఈ రెండు ఫ్రూట్‌జ్యూస్ సెంటర్‌లకు జరిమానా విధించారు.

## ఇసుక ట్రాక్టర్లకు
## పగలు బ్రేక్ వేశారు

ఇసుక ట్రాక్టర్ల మూలంగా నెల్లూరు నగర ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. పగలు ఇసుక ట్రాక్టర్లకు అనుమతి లేకుండా చేశారు. రాత్రి 9గంటల నుండి ఉదయం 6గంటల దాకా మాత్రమే నగరంలో ఇసుక ట్రాక్టర్లు రావడానికి అనుమతించారు. దీంతో పగలు నగర రోడ్లపై ఇసుక ట్రాక్టర్ల బెడద తప్పిపోయింది.



## వేలూరు రంగారావుకు
## ఫ్రెండ్స్ వాకర్స్ సత్కారం

నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా లీగల్ సలహాదారుడు, ప్రముఖ న్యాయవాది వేలూరు రంగారావును నియమించారు. ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడైన వేలూరు రంగారావును ఇటీవల స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మురళీకృష్ణ హోటల్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబుతో పాటు అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు జి.వి.కృష్ణయ్య, ఎన్.సాయి సుబ్బారావు, ఇంకా లక్కాకుల శ్రీనివాసులు, ఎం.పిచ్చయ్య, శ్రీనాథరెడ్డి, చెంచయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మసాజ్ ముసుగులో..
## మసాలా!

- 'స్పా' సెంటర్‌పై పోలీసుల దాడి

నెల్లూరుకు మాగుంట లే అవుట్ అంటే హైదరాబాద్‌కు జూబ్లీహిల్స్ లాంటిది. ప్రశాంతమైన ప్రాంతంగా పేరుంది. ఇలాంటి ప్రాంతంలోనే మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డును ఆనుకునే వున్న ఓ భవనంలో మసాజ్ సెంటర్ పేరుతో చేస్తున్న చీకటి పనులు పోలీసుల ఆకస్మిక దాడితో వెలుగులోకి వచ్చాయి. వివరాలలోకి వెళితే మాగుంట లేఅవుట్ మెయిన్ రోడ్డులోని ఓ వాణిజ్య భవనం మూడో అంతస్థులో 'స్టూడియో11' పేరుతో స్పా సెంటర్ నిర్వహిస్తున్నారు. అయితే నిర్వాహకులు స్పా సెంటర్ ముసుగులో బయట ప్రాంతాల నుండి యువతులను తీసుకొచ్చి మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నారనే సమాచారం పోలీసులకు చేరింది. ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆదేశాల మేరకు నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 5వ తేదీ చిన్నబజారు, దర్గామిట్ట సిఐలు శ్రీనివాసన్, నాగేశ్వరమ్మలు తమ సిబ్బందితో ఈ సెంటర్‌పై దాడి చేశారు. ఈ సెంటర్ నిర్వాహకుడితో పాటు ఇద్దరు యువకులు, ఇద్దరు యువతులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎప్పుడూ రద్దీగానూ, నగరంలోనే పెద్దసెంటర్‌గాను వుండే ఈ ప్రాంతంలో ఈ వ్యవహారం బయటపడడంతో స్థానికులు అవాక్కయ్యారు.

## యూనివర్శిటీలో ఎస్‌బిఐ బ్రాంచ్



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. 5వ తేదీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు దీనిని ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈ బ్యాంకును ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ రవిచంద్రన్, యూనివర్శిటి రిజిస్ట్రార్ ఎ.ప్రసాద్, కోశాధికారి యశ్వంత్, పిజి సెట్ కన్వీనర్ వీరారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'T' వంతెన..
## 'U'లా కుంగింది

నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం వద్ద ముంబై రహదారి వైపు వెళ్ళే మార్గంలో ఇంతకుముందు రైల్వేగేటు వుండేది. రైళ్ళ రాకపోకల సమయంలో ఈ గేటు ముందు భారీ ఎత్తున అటు ఇటూ వాహనాలు నిలిచిపోతుండేవి. ఈ సమస్యకు పరిష్కారంగా రైల్వే ఓవర్ వంతెన నిర్మించాలనుకున్నారు. అయితే సౌలుచింతల వైపు నుండి పెన్నా బ్రిడ్జి వైపు 'ఎల్' ఆకారంలో వంతెన కాకుండా కావలి వైపు మార్గాన్ని కూడా అనుసంధానిస్తూ 'టి' టైప్ ఫ్లైఓవర్ వంతెనను నిర్మించారు. 2002లో దీని నిర్మాణం మొదలుపెట్టగా 2007లో పూర్తిచేసి వాడుకలోకి తెచ్చారు. ఈ వంతెన వచ్చాకే ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌జామ్ తగ్గి బుచ్చి వైపు వెళ్లే వాహనాలు సులభతరంగా వెళుతున్నాయి. అయితే మొన్న ఆ వంతెనపై సౌలుచింతల వైపు మార్గంలో కొంత కుంగింది. కుంగిన ప్రాంతం క్రింద కరెక్ట్‌గా రైల్వేట్రాక్ వుంది. వంతెన కుంగగానే పోలీసులు అక్కడ వాహనాల రాకపోకలు ఆపేసి కోవూరు వైపుగా మళ్లించారు. కుంగిన ప్రాంతంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. రైల్వే అధికారుల సహకారంతో కుంగిన వంతెన వద్ద మరమ్మత్తులు చేపట్టారు.

## ఈ ఏరియా..
## యమ డేంజర్



నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ నుండి పూలే బొమ్మ వరకు రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ నరకంగా వుంటోంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద నుండి వాహనాలు వేగంగా వస్తుంటాయి. బాలాజీనగర్ వైపున వంతెన మలుపు తిరిగి వుంటుంది. దీంతో వేగంగా వస్తున్న వాహనాలు గుద్దుకోవడం, ఓవర్ టేక్ చేసే సమయంలో ఎదురుగా వాహనాలొచ్చి యాక్సిడెంట్లు కావడం జరుగుతుంటుంది.

ఇటీవల బైక్ మీద వెళుతున్న ఓ యువకుడు ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక బ్రిడ్జి మీద నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లాలంటే పూలే బొమ్మ వద్ద 'యూటర్న్' తీసుకోవాలి. ఎక్కువ సంఖ్యలో బస్సులు వస్తుంటాయి. ఇక్కడ చూస్తే రోడ్డు వెడల్పు లేదు. రోడ్డుకిరువైపులా ఆక్రమణలున్నాయి. వాహనాలు మలుపు తిరగడం చాలా కష్టంగా వుంటోంది. వాహనాలు మలుపు తిరిగే సమయంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సివుంది.

## కార్పొరేషన్‌కు
## విద్యుత్ కార్లు

కాలుష్య నివారణ కోసం నగరాలలో ప్రభుత్వ శాఖల్లో విద్యుత్ కార్లను ప్రవేశపెడుతుండడం తెలిసిందే! మొదట నెల్లూరులో విద్యుత్ శాఖకు విద్యుత్ కార్లు కేటాయించారు. త్వరలోనే నెల్లూరు కార్పొరేషన్‌కు 15 విద్యుత్ కార్లు రానున్నాయి. కేంద్రానికి చెందిన ఈఈఎస్ఎల్ ద్వారా నెడ్‌క్యాప్ ఈ కార్లను అందించనుంది. కమిషనర్ ఎంవివిఎస్ మూర్తి ఇటీవల విద్యుత్‌శాఖ వారి నుండి విద్యుత్ కారు తెప్పించుకుని ట్రయల్ కూడా వేశారు.



# తుంగా శ్రీదేవమ్మకు పలువురి నివాళి

'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారి ఉత్తరక్రియలు ఈనెల 3వతేదీ నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని ఆమె మూడవ కుమారుడు 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు) ఇంటి వద్ద జరిగాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీమేయర్‌లు ఎన్.బానుశ్రీ, అబ్దుల్ అజీజ్, వైసిపి నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పి.రూప్‌కుమార్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, నూనె మల్లిఖార్జునయాదవ్, మాజీ డిసిసిబి ఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కిన్నెర కృష్ణమూర్తి, జనసేన క్రమశిక్షణా సంఘం సభ్యులు మనుక్రాంత్ చెన్నారెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సి.యం.కె.రెడ్డి, శ్రీసిటి యం.డి రవీంద్ర సన్నారెడ్డి, సింహపురి హాస్పిటల్స్ అధినేత కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ జె.యస్.రెడ్డి, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, రత్నం విద్యా సంస్థల అధినేత కె.వి.రత్నం, కె.కృష్ణ కిషోర్, సిఎం పిఎస్ ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి, విశ్రాంత డిఆర్‌ఓలు బి.రామిరెడ్డి, ఇస్కా భక్తవత్సలరెడ్డి, హెచ్‌ఎం టివి సిఇఓ శ్రీనివాసరెడ్డి, ఏ.సి. సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, గాన గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కుమారుడు, గాయకుడు ఎస్.పి. చరణ్‌తో పాటు పలువురు తుంగా కుటుంబ బంధువులు, అభిమానులు, ఆత్మీయులు, 'లాయర్' పత్రిక శ్రేయోభిలాషులు హాజరై తుంగా శ్రీదేవమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
















# సమన్వయంతో సమస్యల పరిష్కారం

కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలోని అభివృద్ధి పనులపై ఈ నెల 3వ తేదీన నెల్లూరు జడ్పీ సమావేశమందిరంలో పూర్తి స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర హోంమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి మేకతోటి సుచరిత తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కిలివేటి సంజీవయ్య, వి.వరప్రసాద్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో తాగునీరు, వ్యవసాయం, విద్య, విద్యుత్ సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలో నెలకొన్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి పథకాల గురించి మంత్రులు వివరించారు. జిల్లాలో చేపట్టబోయే వివిధ పనులను గురించి ప్రస్తావించారు. మొత్తానికి ఒక్క ప్రతిపక్ష సభ్యుడు కూడా లేకుండా సమావేశం వార్ వన్‌సైడ్ అన్నట్లుగా జరగడం విశేషం.





మంత్రులకు స్వాగతం పలుకుతున్న ముక్కాల ద్వారకానాథ్

## రాష్ట్ర మంత్రులకు నెల్లూరులో..
# ఆత్మీయ స్వాగతం

కంచిలోని అత్తివరదరాజస్వామి దర్శనానికి వెళ్తున్న రాష్ట్ర మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, పేర్ని నాని, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులకు మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఈనెల 4న ఆత్మీయ స్వాగతం పలికారు. నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి కల్యాణ మండపంలో జిల్లా, నగర వైశ్య ప్రముఖులతో కలిసి వారికి స్వాగతం పలికారు. మంత్రులతో పాటు వచ్చిన వారి కుటుంబ సభ్యులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య నాయకులు దాసా సురేష్ రాజా. చలువాది శరత్ కుమార్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, అమరా వెంకటేశ్వర్లు, దొంతంశెట్టి వివేకానందం. శ్రీరాం సురేష్, ఇమ్మడిశెట్టి సురేష్, చందవోలు సతీష్, వొమ్మిన మురళీకృష్ణ, కోట గురుబ్రహ్మం, శేగు షణ్ముఖరావు, దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, రంగనాథస్వామి దేవస్థానం ఇఓ వేమూరి గోపి, శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ఇఓ పీవీపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పనులు ఆపితే ప్రయోజనమేంటి?

– మాణిక్యాల రావు



గత ప్రభుత్వంలో చేపట్టిన పనులను వైసిపి ప్రభుత్వం ఆపేయడం వల్ల ప్రయోజనమేంటో చెప్పాలని మాజీమంత్రి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పి.మాణిక్యాలరావు ప్రశ్నించారు. 4వ తేదీ నెల్లూరు వచ్చిన ఆయన బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించడం, అవినీతిపై విచారణకు కమిటీలు వేయడం బాగానే వుందని, మరి ఆ అవినీతి ఆరోపణలు నిగ్గు తేల్చేందుకు జ్యుడిషియల్ కమిటీలు ఎందుకు వేయడంలేదన్నారు. బందరు పోర్టుపై జి.ఓను విడుదల చేసి, ఆ జి.ఓ సీక్రెట్ అని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు తెస్తామని జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని, ఆ ప్రాజెక్టులను ఏ విధంగా తెస్తారన్నదానిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం కాంట్రాక్ట్ రద్దు వల్ల ప్రాజెక్ట్ నిర్మాణం ఆలస్యం కావడం తప్పితే ఇంకోటి వుండదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇళ్ళను పేదలకు పంపిణీ చేయాలని, ఇళ్ళ నిర్మాణంలో అవినీతి జరిగితే దానిపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, నాయకులు ఎం.ఈశ్వరయ్య, కందుకూరి సత్యనారాయణ, మిడతల రమేష్ పాల్గొన్నారు.

## 'కృష్ణచైతన్య'లో..
# టెక్‌మహేంద్ర ప్రాంగణ ఎంపికలు



నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఈనెల 3న టెక్‌మహేంద్ర కంపెనీవారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఇందులో 150మంది విద్యార్థులు పాల్గొనగా, వ్రాతపరీక్షలు పూర్తిచేసుకుని 32 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా. ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ అర్హతకు అవసరమైన స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సులను అందిస్తున్నామని, ఇప్పటి వరకు 527 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లతో పాటు డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ యన్.కృష్ణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో...
# ఎన్‌బికెఆర్ టాప్



ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల జిల్లాలో అగ్రస్థానంలో నిలిచిందని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు 4వ తేదీ కళాశాలలో స్వాగత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని కళాశాలలకన్నా కన్వీనర్ కోటాలో తమ కాలేజీలోనే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయన్నారు. సిఎస్ఇ, ఇసిఇ, ఐటి విభాగాలలో నూరుశాతం సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. ఎన్‌బికెఆర్‌కు నాక్, ఎన్‌బిఏ, అటానమస్ ఉన్నాయని, చాలామందికి ఈ విషయాలు తెలియక తమ ఆప్షన్ల నమోదులో పొందుపరచలేకపోయారన్నారు. రెండవ విడత కౌన్సిలింగ్‌లోనైనా తమ కళాశాలను ఎంపిక చేసుకుని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలలో సీట్లు పొందాలని కోరారు. అధ్యాపకుల బోధనా నైపుణ్యం, కళాశాలలో ఆధునిక ప్రమాణాల గురించి తెలుసుకునే ఎక్కువ మంది విద్యార్థులు తమ కళాశాల పట్ల మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# వాలెంటీర్లకు నియామక పత్రాలు



వాలెంటీర్లకు నియాక పత్రాలను అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్

గూడూరులోని మునిసిపల్ ఆఫీసులో 33 వార్డులకు సంబంధించి ఎంపికైన 315 మంది వాలెంటీర్లకు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు ఈనెల 5న నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వాలెంటీర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# సబ్ కలెక్టర్ బదిలీ



గూడూరు సబ్‌కలెక్టర్ ఓ.ఆనంద్‌ను బదిలీ చేస్తూ ఈనెల 5న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను పోలవరం ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది. గూడూరు సబ్‌కలెక్టర్‌గా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఎన్నికల ముందు 5 నెలల క్రితం ఓ.ఆనంద్ గూడూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# సాయి మందిరంలో ఉచిత వైద్యశిబిరం




వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి

గూడూరు పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీ సాయిబాబా మందిరంలో ఈనెల 4న ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సి.జనార్దన్‌రెడ్డి, సి.రోహిణి పాల్గొని వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జీవని, డాక్టర్ లక్ష్మి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామి ఆలయానికి..
# విద్యుత్ సరఫరా పునరుద్ధరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏ.ఓకు వినతిపత్రం అందజేస్తున్న వాసిలి ప్రవీణ్

గూడూరు కరకాలవీధిలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయానికి గత రెండురోజులుగా విద్యుత్ సరఫరాను తొలగించారని, దీనివల్ల ఆలయంలో నిత్య కైంకర్యాలకు ఇబ్బంది కలుగుతోందని అంటూ ఆలయానికి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని దేవస్థానం నిర్వాహకులు వాసిలి ప్రవీణ్, అనిల్, చైతన్య, సాయి, రోహిణి, సందీప్, నరేష్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఏ.ఓకు ఈనెల 5న వినతిపత్రం అందజేశారు. ఆలయం ఇ.ఓకు ఈ విషయం తెలియజేసేందుకు గత వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా ఆయన అందుబాటులో లేరని వారు పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ వెంటనే స్పందించి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సిందిగా వారు కోరారు.

# చెట్లు మానవాళికి ప్రాణదాతలు



మొక్కలు నాటిన సిఐ దశరథరామారావు, సురేష్‌బాబు తదితరులు

చెట్లు మానవాళికి ప్రాణదాతలని గూడూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దశరథరామారావు అన్నారు. గూడూరు రెండవ పట్టణంలోని మాళవ్యానగర్ ప్రాంతంలో ఈనెల 3న చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిఐ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల ద్వారానే మనకు ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.సుగమ్‌బాబు మాట్లాడుతూ ఇప్పుడు వానజల్లులు పడుతున్నాయి కనుక 500 మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నామన్నారు. సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లురాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# అమెజాన్ అడవుల్లో రాహుల్, లోకేష్ సాహసాలు

ఢిల్లీలోని టెన్ జనపథ్... సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలతో పాటు గులాం నబీ ఆజాద్, అహ్మద్ పటేల్, అంబికా సోని, మల్లికార్జున ఖర్గే, మనీష్ తివారి, దిగ్విజయ్‌సింగ్ వంటి నాయకులు కూర్చుని వున్నారు. ఎదురుగా టీవీలో డిస్కవరి ఛానల్‌లో 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రోగ్రామ్ అప్పుడే మొదలైంది. అందరూ ఉత్కంఠగా చూడడం మొదలుపెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, గిల్‌బేర్‌లు గిర్ అడవుల్లోకి ఓపెన్ టాప్ జీపులో ప్రవేశించారు. వాళ్లు జీపులో పోతుంటే అటు ఇటు జింకలు, కుందేళ్ల పరుగులు తీస్తున్నాయి. కొద్దిదూరం వెళ్లేసరికి పెద్ద ఏనుగుల గుంపు... నరేంద్ర మోడీ ఏ మాత్రం భయపడకుండా వాటి దగ్గరకెళ్లి జీపులో వున్న చెరుకుగడలు తీసి అందించాడు. అవి తిన్నాయి. ఓ ఏనుగు తొండాన్ని ముందుకు వంచింది. నరేంద్ర మోడీ 'బాహుబలి' సినిమాలో ప్రభాస్ లాగా దాని తొండంపై కాలు పెట్టి పైకి ఎక్కాడు. దాని మీద కూర్చుని కొద్దిసేపు తిరిగాడు. మళ్లీ దాని మీద నుండి దిగి జీపు ఎక్కాడు. కొంచెం ముందుకు పోయాక చిరుతపులుల గుంపు కనిపించింది. నరేంద్ర మోడీ జీపులో నుండి జంప్ చేసి ఒక చిరుతను పట్టుకోబోయాడు. అది మిస్సయ్యింది. మోడీ అక్కడితో ఆగలేదు. దాని వెనుకే పరుగెత్తాడు. చిరుత కన్నా వేగంగా పరిగెత్తి దానిని పట్టుకున్నాడు. టీవీలో అది చూస్తున్న సోనియా... ఓర్నాయనో... ఇక్కడ మనుషులను వదలడం లేదు... అడవిలో జంతువులనూ వదలడం లేదు అని అంది. అంతలో విహెచ్ హనుమంతరావు అందరికీ స్నాక్స్, కాఫీలు తెచ్చాడు. అందరూ వాటిని తింటూ మళ్లీ టీవీ చూడసాగారు. ఈసారి మోడీ, బేర్‌లు కూర్చున్న జీపు సింహాల మధ్యగా పోతోంది. బలిసిన ఒక సింహం ముందు మోడీ దిగాడు. మోడీ వైపు క్రూరంగా చూసిన సింహం పెద్దగా గర్జించింది. మోడీ కూడా దాని వైపు అంతకంటే క్రూరంగా చూసి... దాని స్టైల్‌లోనే గర్జించాడు. దాంతో ఆ సింహం పారిపోయింది. అది చూస్తున్న సోనియా మన సులో... ఇతన్ని చూసి కరుడు కట్టిన ఉగ్రవాదులే పారిపోతున్నారు, ఈ నోరులేని క్రూరమృగాలు పారిపోవడం ఓ లెఖ్ఖా అనుకుంది. ఆ తర్వాత మోడీ, బేర్‌లు ఓ తెప్పపై సరస్సులో దిగారు. వాళ్ల చుట్టూ మొసళ్లు తిరుగుతున్నాయి. అయినా మోడీ కళ్లల్లో ఏ మాత్రం భయం కనిపించడం లేదు.

సోనియా చిరాగ్గా రిమోట్ తీసుకుని టీవీని ఆఫ్ చేసేసింది. ఎందుకు మమ్మీ ఆపేసావ్, ఇంట్రస్ట్‌గా వుంది కదా అని రాహుల్ అడిగాడు. ఇంట్రస్ట్‌గా వుంది కాబట్టే ఆపేశాను. ఈరోజు ఈ ప్రోగ్రామ్ ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది చూస్తారు. మోడీ పాపులారిటీ పెరుగుతుంది. ఇలాంటివి చూసి నేను తట్టుకోగలనా? ఇలాంటి అడ్వంచర్స్ నువ్వు చేస్తే నాకు చూడాలని వుంది అని సోనియా అంది. అప్పుడే రెండోరౌండ్ కాఫీలు తెచ్చిన విహెచ్ హనుమంతురావు ఆ మాటలు విన్నాడు. వెంటనే సోనియాతో... అట్లాగైతే రాహుల్ బాబుకు పెళ్లి చేసేద్దామమ్మా, ప్రపంచమంతా అన్ని టీవీలలో లైవ్ ఇద్దామన్నాడు. సోనియాకు అరికాల్లో మండింది. నేను అడ్వెంచర్స్ గురించి మాట్లాడుతుంటే, నువ్వు పెళ్లి అంటావేంటి అని కోపంగా అంది. అందుకు విహెచ్ కూల్‌గా... ఈ లోకంలో పెళ్లికి మించిన సాహస విన్యాసం ఏముంటుందమ్మా అని చెప్పాడు. సోనియాకు ఇంకొంచెం తిక్క రేగి... ఈ పంచ్ డైలాగ్‌లకేం కాని... ముందు రాహుల్ క్రేజ్ పెరిగేలా ఇలాంటి కార్యక్రమం ఏదన్నా ప్లాన్ చేయండి అని చెప్పింది. ఇలాంటివి చేయాలంటే మనం హైటెక్‌రత్న చంద్రబాబునాయుడును సంప్రదించాలమ్మా అని చెప్పాడు. అయితే బాబుగారిని పిలిపించండి అని సోనియా అనడంతోటే విహెచ్ సెల్‌ఫోన్ తీసి ఆయన నెంబర్‌కు డయల్ చేశాడు.

★★★★★

సోనియా, ఆమె టీమ్ సీరియస్‌గా కూర్చునివున్నారు. ఏం మేడమ్ అర్జంట్‌గా రమ్మన్నారు, మేటర్ చెప్పండని చంద్రబాబు అడిగాడు. మీరు ఈరోజు డిస్కవరీ ఛానెల్‌లో మోడీ ప్రోగ్రామ్ చూశారా అని సోనియా అడిగింది. చూశానని చంద్రబాబు చెప్పాడు. ఈ ప్రోగ్రామ్‌తో మోడీ పాపులారిటీ పెరిగింది. ఇలాంటి సాహసాలతో రాహుల్ ఇమేజ్ కూడా పెరగాలి. కాని వీడు పులిని చూస్తేనే కాదు పిల్లిని చూసినా పారిపోతాడు, మరి వీడి చేత ఇలాంటి అడ్వంచర్స్ ఎలా చేయించాలని సోనియా అడిగింది. చంద్రబాబు వుండి... మేడమ్, నేనిప్పుడు రాహుల్‌ను నా వెంట తీసుకెళ్తాను... ఓ వారం తర్వాత వస్తాను. రాహుల్‌కు తోడుగా లోకేష్ కూడా వుంటాడు. వారం తర్వాత వీళ్ల అడ్వంచర్స్ వీడియో ఇస్తాను చూడండి అని చెప్పాడు. చంద్రబాబు మీద నమ్మకంతో రాహుల్‌ను ఆయన వెంట పంపించింది సోనియా!

★★★★★

వారం రోజులు గడిచాయి. టెన్‌జనపథ్‌లో సోనియాతో పాటు కాంగ్రెస్ నాయకులంతా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అప్పుడే ఒక కారొచ్చి అక్కడ ఆగింది. అందులో నుండి చంద్రబాబు దిగాడు. లోపలకెళ్లాక చంద్రబాబు ఒక సి.డిని సోనియాకిచ్చాడు. ఆమె ఆత్రుతగా సి.డి ప్లేయర్‌లో దానిని పెట్టి ఆన్ చేసింది. టీవీ స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

★★★★★

అవి ప్రపంచంలోనే భయంకరమైన అమెజాన్ అడవులు. ఆకాశాన్నంటుతున్నట్లుగా వున్న చెట్లు... దట్టమైన పొదలు... ఆ చెట్లను చుట్టుకుని పెద్దపెద్ద అనకొండలు. వందల సంఖ్యలో సింహాలు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు, ఖడ్గమృగాలు... వాటిని చూస్తుంటే భయంతో ఒళ్లు గగుర్పాటు చెందుతుంది. అంతటి భయంకరమైన అడవిలోకి 'కుయ్యో కుయ్యో' అని అరుస్తూ ఇద్దరు యువకులు ప్రవేశించారు. వారి చేతుల్లో ఈటెలు వున్నాయి. ఒంటి మీద బట్టలు లేవు. నడుము, తలకు ఆకులు, చెట్ల తీగలు చుట్టుకుని చూడ్డానికి మినీ టార్జాన్స్ లాగావున్నారు. సోనియా వారిని తీక్షణంగా చూసి... వీళ్లు మన రాహుల్, లోకేష్‌లే కదా అని అడిగింది. అవును మేడమ్, మన సాహస వీరులే అని చంద్రబాబు చెప్పాడు. సోనియా భయంతో... అయ్యో, నేనెంత పాపిష్టిదాన్ని అడ్వంచర్స్ కోసం బిడ్డను అంతటి భయంకరమైన అడవులకు పంపించానా... నా బిడ్డకు ఏమైంది అని ఏడుపు మొదలుపెట్టింది. చంద్రబాబు ఆమెను ఓదారుస్తూ... మీ బిడ్డకు ఏమీ కాలేదు మేడమ్... ముందు ఆ సన్నివేశాలు పూర్తిగా చూడండి అని చెప్పాడు. దాంతో సోనియా మళ్లీ టీవీ వైపు చూడ సాగింది. రాహుల్, లోకేష్‌లు అక్కడ వేలాడుతున్న చెట్ల వూడలు పట్టుకుని అటు ఇటూ వూగసాగారు. అంతలో ఒక అనకొండ వారి మీద దాడి చేయడానికి వచ్చింది. రాహుల్ వెంటనే తన చేతిలో వున్న ఈటెను దాని మీదకు విసిరాడు. అది గుచ్చుకుని ఆ అనకొండ చచ్చిపోయింది. రాహుల్, లోకేష్‌లు ఎవరెస్ట్‌కంటే ఎత్తైన పర్వతం పైకి ఎక్కారు. అక్కడనుండి ఇంకో కొండ మీదకు జంప్ చేశారు. ఆ కొండ మీద నుండి అమెజాన్ నదిలోకి జంప్ చేశారు. వీళ్ళు నదిలోకి దూకగానే అక్కడవున్న వందల సంఖ్యలో మొసళ్ళు వీరిని చుట్టుముట్టాయి. అప్పుడు లోకేష్ తెలివిగా నీటిలోకి సహజవాయువును వదిలాడు. అంతే మొసళ్లు అక్కడనుండి ప్రాణభయంతో పరుగులు తీశాయి. రాహుల్, లోకేష్‌లు నదిలో నుండి ఒడ్డుకొచ్చారు. అక్కడ పెద్ద సింహాల గుంపు వుంది. వీళ్ల మీద పంజా విసరడానికి అవి సిద్ధమవుతున్నాయి. ఈ సమయంలో లోకేష్ ఒక్క క్షణం తెలివిగా ఆలోచించాడు. వెంటనే జై బాలయ్య అంటూ తొడ చరిచాడు. అంతే సింహాలు చెల్లాచెదురయ్యాయి.

ఇక్కడితో సీన్‌లు ఆగిపోయాయి. చంద్రబాబు వుండి ఇది ఒట్టి ట్రయల్ పార్ట్ మాత్రమే. పూర్తి ఎపిసోడ్ గంట దాకా వుంటుంది. దీనిని టీవీలలో ప్రసారం చేయిస్తే వీళ్ల పాపులారిటీ అంతర్జాతీయ స్థాయిలో వుంటుంది అని చెప్పాడు. సోనియా ఆశ్చర్యంతో పాపులారిటీ సరే... అమెజాన్ అడవుల్లోకి వాళ్లిద్దరినీ ఎలా తీసుకెళ్లారు. అసలు భయం లేకుండా వాళ్లను ఎలా తిప్పారు అని సోనియా అడిగింది. దానికి చంద్రబాబు ఒరిజినల్ అడ్వంచర్స్ చేయాలంటే మోడీలాంటి అమాయకులు అడవుల్లోకి పోతారు. కాని నేను టెక్నాలజీకి పితామహుడిని.... ఆ టెక్నాలజీతో అమెజాన్ అడవులనే నా దగ్గరకు రప్పించుకున్నాను అని చెప్పాడు. కొంచెం అర్ధమయ్యేలా చెప్పు అని సోనియా అడిగింది. అప్పుడు చంద్రబాబు... ఏం లేదు మేడమ్... మీరు నన్ను పిలిచి విషయం చెప్పగానే 'బాహుబలి' సినిమా దర్శకుడు రాజమౌళి గుర్తుకొచ్చాడు. వెంటనే రాహుల్‌ను లోకేష్‌ను తీసుకెళ్లి రాజమౌళికి అప్పగించి విషయం చెప్పాను. ఆయన వీళ్లిద్దరినీ రామోజీ ఫిలింసిటీకి తీసుకెళ్లాడు. అక్కడ సెట్టింగ్స్ వేశారు. అమెజాన్ అడవుల్లో వీళ్లు ఇవన్నీ చేస్తున్నట్లు గ్రాఫిక్ సీన్‌లు సృష్టించారు. మోడీ ఒరిజినల్ వీడియో కంటే మనవాళ్ళ గ్రాఫిక్ వీడియోనే బ్రహ్మాండంగా వుంది అని చెప్పాడు. అంతా విన్న సోనియా చంద్రబాబుతో... ఇన్ని టక్కుటమార విద్యలు తెలిసినోడివి... నువ్వు ఓడిపోవడం ఏంటయ్యా... అని అంది.



## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నెల్లూరు నగర పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఈనెల 5న నెల్లూరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నెల్లూరు కొండాయపాళెం ఇస్కాన్ సిటీలో రోడ్డు మార్గంలో నాలుగు అంతస్తులకు అనుమతులు తీసుకుని నిర్మాణం చేపట్టి. పార్కింగ్ స్థలంలోను నివాసం నిర్మిస్తున్నట్లు సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. మూలాపేట కొండదిబ్బ ప్రాంతంలో మూడు అంతస్తులకు అనుమతి తీసుకుని నాలుగు అంతస్తులు నిర్మాణం చేపట్టడంతో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నాలుగో అంతస్తును కూల్చివేశారు. డీసీపీ హరిప్రసాద్, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, టీపీఓ రమేష్ బాబు, టీపీఎస్‌లు శివప్రసాద్, హృదయరాజ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఈడీగా గోపీనాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు రీజియన్లు కలిసిన నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా గోపీనాథ్‌రెడ్డి ఈనెల 3న ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు ఈడీగా ఉన్న జి.వెంకటేశ్వరరావును విజయవాడకు బదిలీ చేశారు. వీరిరువురిని ఏఎన్ఎంయూ నాయకులు సత్కరించారు. ఏఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి ఎస్.విజయ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రమణరాజు, బీయస్ రాజు పాల్గొన్నారు.

### ఇళ్ళ స్థలాలు కావాలంటూ
## హిజ్రాల ధర్నా



నెల్లూరు జిల్లాలో 900 మందికి పైగా హిజ్రాలు యాచక వృత్తి చేసుకుంటూ, కుటుంబసభ్యులకు దూరంగా దుర్భర జీవితం గడుపుతున్నారని హిజ్రాల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్.అలేఖ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 5న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడుతూ నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో స్థలం గుర్తించి సర్వే చేసి 44 మందికి పట్టాలు సిద్ధం చేసినా ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి పట్టాలు సిద్ధం చేసిన 44 మందికి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శేషగిరిబాబుకు వినతి పత్రం అందజేసారు.

## గుండాల గురవయ్యకు సన్మానం

శ్రీహరి వెంకట అన్నమాచారులు బిరుదాంకితులు గుండాల గురవయ్య దంపతులను ఈనెల 3 న నెల్లూరులోని పాండురంగ అన్నదాన సమాజంలో సన్మానించారు. ఉస్మాన్ సాహెబ్ పేట, శ్రీహర హరనాథ భజన మండలి, కోలాట మండలి 10 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు, అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ మాట్లాడుతూ గురవయ్య ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా భజనలు, కోలాటాలు, భక్తి సంగీతాల్లో దాదాపు వెయ్యిమందికి పైగా మహిళలకు శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన అన్నమాచార్య సంకీర్తనలు, పురందరదాసు కీర్తనలు గానం చేయడమే గాక తమందరికి నేర్పించినందుకు కృతజ్ఞతగా సభ్యులు ఈ సన్మానం చేయడం జరిగిందన్నారు. సుకన్య, దేవీ, శైలజ, కోకిల, సుమలత, సునంద, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు...
## యువత మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణకు యువత మొక్కలు నాటాలని నెల్లూరు నవాబుపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి అన్నారు. ఈనెల 4 న స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్పు కోసం మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు లోని వెంకటేశ్వరపురం, జనార్ధన్ రెడ్డి కాలనీ, ముస్లిం స్మశాన వాటికల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుతం యువత సామాజిక మాధ్యమాలను సమాజ హితం కోసం ఉపయోగించాలన్నారు. ఫేస్‌బుక్‌లో యువత ట్రీ బుక్‌లను నిర్వహించి మొక్కలు నాటిన ఫోటోలను అందులో ఉంచాలన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు ప్రసాద్,మున్నా, రవూఫ్, జమీర్, ఖలీల్, ఉస్మాన్, షారుఖ్, ఖాదర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో..

# కోట్లు దోచుకున్నారు

### - టిడిపి నాయకులపై వైఎస్సార్సీపి నేత రూప్ విమర్శ



గత టిడిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో టిడిపి నాయకులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని వైఎస్సార్సీపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఈనెల 7న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి నారాయణ అనాలోచిత నిర్ణయాల వల్లనే నెల్లూరు నగరప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, భూగర్భ డ్రైనేజీ పనులకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క ఇంటికి కూడా ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ ఏర్పాటు చేయలేదని, ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలంటే వేసిన సిసిరోడ్లు మళ్ళీ పగులగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, నగర కార్పొరేషన్ అధికారులు గతంలో ఈ సమస్యలను అప్పటి మంత్రి నారాయణకు వివరించినా పట్టించుకోలేదని, సంతపేట మార్కెట్ నిర్మాణంలో కూడా లోపాలు బయటపడ్డాయని విమర్శించారు. నుడా ఛైర్మెన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సాగించిన అవినీతి చిట్టాను కూడా బయటపెడతామని చెప్పారు. జలవనరులశాఖ మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. కర్తం ప్రతాప్‌రెడ్డి, ఎం.డి ఖలీల్‌అహ్మద్, వేలూరు మహేష్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, కె. శ్రీనివాసులు, వందవాసి రంగా, దేవరకొండ అశోక్, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు పాల్గొన్నారు.

## ఆదర్శనీయులు.. డా. బెజవాడ గోపాలరెడ్డి



బెగోరె జయంతి సభలో మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ జె.వి.రెడ్డి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ డా. బెజవాడ గోపాలరెడ్డి 112వ జయంతి వేడుకలను ఈ నెల 5న నెల్లూరులోని డా. బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ జెవి రెడ్డి మాట్లాడుతూ డా. బెజవాడ గోపాలరెడ్డి నేటితరానికి ఆదర్శప్రాయులని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా డా. గోపాలరెడ్డి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏ.ఓ నరేష్, ప్రిన్సిపాల్ శ్రీమతి మృదుల, రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకుడు రూప్‌కుమార్‌తో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

### కాలధర్మం

## ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి




సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం మాజీఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి ఈ నెల 7వ తేదీ బుధవారం సాయంత్రం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో కనుమూశారు. ఆయన వయసు 62సంవత్సరాలు. ఆయనకు భార్య, ఒక కుమారుడు వున్నారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు ఆయన స్వగ్రామం. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికి అత్యంత సన్నిహితుడు. సూళ్లూరుపేట సమితి మాజీఅధ్యక్షుడు బద్దెపూడి పేరారెడ్డి మనవడు(కూతురి కొడుకు) అయిన హర్షవర్ధన్‌రెడ్డి ఆయనకు రాజకీయ వారసుడు కూడా అయ్యాడు. కోటపోలూరు పంచాయితీ సర్పంచ్‌గా పని చేశారు. సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్‌గాను, సూళ్లూరుపేట ఎంపిపిగాను బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంకు రెండు దఫాలు ఛైర్మెన్‌గా సేవలందించి దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశారు. సూళ్లూరుపేట ప్రజలలో ఆయనకు మంచి పేరుంది. జిల్లాలోని అన్ని పార్టీల ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఎన్నికలకు ముందు ఆనం రామనారాయణరెడ్డి కోరడంతో ఆయన వైసిపిలో చేరారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి 7వ తేదీ కనుమూశారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## రోబోటిక్స్ అంశాలపై..

## అమెరికా అమ్మాయి

# 'నీహారిక' పాఠాలు

### ముత్తుకూరులో బాలబాలికలకు మూడువారాల పాటు శిక్షణ





అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ట్వెల్త్ క్లాస్ చదువుతున్న నీహారిక.. మన జిల్లాలోని చిన్నారులకు రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి అందరి ప్రశంసలు అందుకుంది. ఇటీవలే మూడువారాల పాటు ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ హైస్కూల్‌లోని బాలబాలికలకు రోబోటిక్స్‌కు సంబంధించిన పలు అంశాలను, సాంకేతిక విషయాలను వివరిస్తూ వారిలో వాటి పట్ల ఆసక్తిని.. అవగాహనను కల్పించింది. ఈ సందర్భంగా అందుకు అవసరమైన పరికరాలను కూడా నీహారిక తానే తెచ్చుకుని ఇక్కడి బాలబాలికలకు వాటి ఉపయోగాలను వివరించడం విశేషం. బెంగళూరులో జన్మించిన నీహారిక నాలుగేళ్ళ వయసులోనే తల్లిదండ్రులైన కోటింరెడ్డి విష్ణుకుమార్-బిందులతో పాటు అమెరికా వెళ్ళింది. తల్లిదండ్రులు అమెరికాలోనే ఉద్యోగాలు చేస్తుండడంతో తాను కూడా అక్కడే ఉంటూ విద్యనభ్యసిస్తోంది. ఇప్పుడు ఆమెరికాలో ట్వెల్త్‌క్లాస్ చదువుతున్న నీహారిక.. తన ప్రాజెక్ట్‌లో భాగంగా రోబోటిక్స్ పరిజ్ఞానాన్ని వెనుకబడిన ప్రాంతాల బాలబాలికలకు కూడా తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతో అమెరికా నుంచి ఇక్కడికి వచ్చి చిన్నారులకు ఆయా అంశాలపై పాఠాలు చెప్తూ అందరి అభినందనలు అందుకోవడం ఎంతైనా విశేషం. అందులోనూ, తాను కూడా విద్యార్థినే అయినా, చిన్నారులకు నీహారిక చక్కగా పాఠాలు చెప్తుంటే ఉపాధ్యాయులు కూడా ఎంతో ఆసక్తిగా విన్నారు. బాలబాలికలందరికీ మూడు వారాల పాటు రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానం గురించి ఆమె అవగాహన కల్పించేందుకు ఇక్కడికి వచ్చినందుకు వారు కూడా ఎంతో సంతోషించారు.

## కోట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా న్యాయవాది పెల్లేటి

ఇటీవల కోటలోని రెడ్డి కళ్యాణ మండపంలో రోటరీక్లబ్ కోట శాఖ ఆవిర్భావ కార్యక్రమం జరిగింది. కోట రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది పెల్లేటి గోపాలరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు విద్య, వైద్య పరంగా రోటరీ క్లబ్ సేవలందించాలని ఆయన కోరారు. కోటలో రోటరీ క్లబ్ సొంత భవన నిర్మాణానికి అవసరమైన స్థలం విషయంలో తన సహకారం అందిస్తానని చెప్పారు.



జ్యోతిప్రజ్వలన చేసి క్లబ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు

క్లబ్ అధ్యక్షులు పెల్లేటి గోపాలరెడ్డి మాట్లాడుతూ 1905లో ఏర్పడిన రోటరీ క్లబ్ ప్రపంచంలోని అన్ని దేశాలలో తన సేవలందిస్తుందన్నారు. సేవా కార్యక్రమాలలో కోట రోటరీక్లబ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్‌కు సంబంధించిన పి. శ్రీనివాసులురెడ్డి, పసుపులేటి కిషోర్, పి. సతీష్, పి. రామకృష్ణారెడ్డి, యం. దయాకర్‌రెడ్డి, మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి 6 లక్షల విరాళం



ఆసుపత్రి నిర్వాహకులకు విరాళాన్నందజేస్తున్న పార్లపల్లి రాజగోపాలయ్య

నెల్లూరు పొదలకూరు రోడ్డులోని రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి కోసం రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్లపల్లి రాజగోపాలయ్య తన తల్లిదండ్రులు కీర్తిశేషులు పార్లపల్లి శేషయ్యనాయుడు, సుబ్బమ్మల జ్ఞాపకార్ధంగా 6లక్షల రూపాయల విరాళం అందజేశారు. 6, 7 తేదీలలో ఆయన మూడేసి లక్షల వంతున ఈ విరాళాన్ని ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. లక్ష్మికి అందజేశారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ఈ విరాళాన్ని వినియోగించుకోవాలని, పేద రోగులకు మంచి వైద్య సేవలందించాలని సూచించారు. రాజగోపాలయ్య గత ఏడాది కూడా తన భార్య స్వర్గీయ పార్లపల్లి అన్నపూర్ణ జ్ఞాపకార్ధంగా 3లక్షలు విరాళం అందించివున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మెన్ యస్. వి. బాబూనాయుడు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చీఫ్‌మేనేజర్ బి. వెంకయ్య పాల్గొన్నారు.

## పేపర్ల రీసైక్లింగ్‌లో

## విశ్వసాయి ఎస్ఆర్‌కె స్కూలుకు

# ఛాంపియన్ ట్రోఫీ



స్వచ్ఛ భారత్ కార్యక్రమ నిర్వహణలో భాగంగా నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కె స్కూల్ విద్యార్థులు పాత పేపర్లను సేకరించి, ఇండియన్ ట్రేడింగ్ కార్పొరేషన్‌కు అందజేయడంలో అగ్రభాగాన నిలిచినందుకు ఆ స్కూలుకు ఛాంపియన్ ట్రోఫీ దక్కింది. ఇండియన్ ట్రేడింగ్ కార్పొరేషన్ వారు ఈ ట్రోఫీని స్కూల్ యాజమాన్యానికి బహుకరించారు. ఈ ట్రోఫీ రావడం పట్ల పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ సత్యనారాయణ, కృష్ణమోహన్, స్కూల్ డీన్ రఘురామ్, హెడ్‌మిస్ట్రస్ బ్యూలా గ్రేస్‌లు విద్యార్థులను అభినందించారు.



సంప్రదాయానికి నిలువెత్తు రూపంగా, నిండైన కుంకుమబొట్టుతో.. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే సుష్మాస్వరాజ్ ఇక లేకపోవడం పట్ల దేశప్రజలు విచారంలో మునిగిపోయారు. సుష్మా మరణవార్త విని శోకతప్తులయ్యారు. పదునైన విమర్శలతో.. ఎంతటి క్లిష్టమైన చర్చల్లోనైనా ధైర్యంగా పాల్గొని రాజకీయ ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయగల సత్తా ఆమె వాగ్దాటికి ఉంది.

# దిగంతాలకు.. ధీర వనిత

దేశరాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వంతో ధీరవనితగా.. ఉత్తమనేతగా పేరొందిన భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత, విశిష్ట పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ (67) ఇక లేరు. 6వ తేది రాత్రి 10.15 గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటు వచ్చి కన్నుమూశారు. ఆమెకు భర్త స్వరాజ్ కౌశల్, కుమార్తె బన్సూరి ఉన్నారు. సుష్మాస్వరాజ్‌కు గుండెపోటు రావడంతోనే కుటుంబసభ్యులు వెంటనే ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో భారత రాజకీయాల్లో సాటిలేని వాగ్దాటి ఆగిపోయినట్లయింది. సుష్మాస్వరాజ్ గత కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్నారు. 2016లో మూత్రపిండాల మార్పిడి కూడా జరిగింది. అనారోగ్య కారణాలతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. ఇంతలో గుండెపోటు తీవ్రమై ఆమె అనంతలోకాలకు తరలిపోయారు. ఎంతటి సమస్యలనైనా ధీరోదాత్తంగా పరిష్కరించే సుష్మాస్వరాజ్ ఆకస్మిక మరణవార్త బిజెపి నేతలను, ఆ పార్టీ కార్యకర్తలను ఎంతగానో కలచివేసింది. ఒక్క భారతీయ జనతాపార్టీకే కాదు.. భారత ప్రజలందరినీ ఆవేదనకు గురిచేసింది.

## విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి...

సుష్మా స్వరాజ్ స్వస్థలం హరియాణాలోని అంబాలా. తల్లి దండ్రులు హరిదేవ్ శర్మ, లక్ష్మీదేవి. తండ్రి హరిదేవ్ అప్పట్లో చాలా చురుగ్గా ఆర్ఎస్ఎస్‌లో పనిచేసేవారు. 1952 ఫిబ్రవరి 14న జన్మించిన సుష్మాస్వరాజ్ చిన్నతనం నుంచి విశిష్టమైన వ్యక్తిత్వంతో.. మంచి వక్తగా ఎదుగుతూవచ్చారు. విద్యార్థి దశ లోనే వక్తృత్వ పోటీలు, చర్చలు, నాటకపోటీల్లో ఎన్నో అవార్డులు పొందారు. 1970 ప్రాంతాల్లో విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఆందోళనల్లో పాల్గొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఆ తర్వాత జనతాపార్టీలో చేరి, 1977లో తొలిసారిగా హరియాణా ఎన్నికల్లో పోటీచేశారు. అప్పటికి ఆమె వయసు పాతికేళ్లే. ఆ ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికై, రాష్ట్ర మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. 1990 ఏప్రిల్‌లో రాజ్యసభ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1996లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పట్లో వాజ్‌పేయి ప్రభుత్వం 13 రోజులపాటు కొనసాగిన సమయంలో ఆమె కేంద్ర సమాచార ప్రసారశాఖల మంత్రిగా కూడా పని చేశారు. 1998లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, అదే ఏడాదిలో ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ఢిల్లీ సిఎం పీఠాన్ని అధిరోహించిన తొలిమహిళగా సుష్మాస్వరాజ్ చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2000–03 మధ్య కేంద్ర సమాచారశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2004లో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా, 2009లో లోక్‌సభలో ప్రతిపక్షనేతగా అనితరసాధ్యమైన రీతిలో పదవులు నిర్వహించిన ఉత్తమ మహిళానేతగా అందరి ప్రశంసలు అందుకున్నారు. 2014 నుంచి 2019 మే నెలాఖరు వరకు ఆమె విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా కూడా అత్యున్నతమైన రీతిలో పనిచేసి అందరి అభిమానాన్ని పొందారు.

## కన్నీటి నివాళి...

సుష్మాస్వరాజ్ ఆకస్మిక మృతిపట్ల దేశప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రహోం మంత్రి అమిత్‌షా తదితర నేతలందరూ ఆమె మృతికి తమ సంతాపాన్ని తెలియజేశారు. గొప్ప ప్రజాదరణ ఉన్న నేతను దేశం కోల్పోయిందని వారు పేర్కొన్నారు. అద్భుతమైన పాలనా దక్షత కలిగిన నేత, గొప్ప పార్లమెంటేరియన్, మంచి వక్త అయిన సుష్మాస్వరాజ్ మృతి తీరని లోటని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు విచారం వ్యక్తం చేశారు. సుష్మాస్వరాజ్ పార్థివదేహానికి బుధవారం ఢిల్లీలో ప్రధాని మోడీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుష్మాస్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్‌తో మాట్లాడుతూ మోడీ కంటతడిపెట్టారు. బిజెపి సీనియర్ నేత అద్వానీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, ఇరాన్ విదేశాంగమంత్రి జవాద్ జరీఫ్ తదితరులు పాల్గొని ఆమెకు నివాళులర్పించి..కన్నీటితో కడసారి వీడ్కోలు తెలిపారు.

## నెల్లూరుతోనూ అనుబంధం...

ప్రజాసేవలో తనదంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటూ, నిబంధనలు సైతం పక్కనపెట్టి సామాన్యులకు సత్వరసేవలను అందించిన ఘనత సుష్మాస్వరాజ్‌కే దక్కుతుంది. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా ఆమె ఉన్నప్పుడు, నెల్లూరులోని విశ్రాంత తహశీల్దార్ రాళ్ళపల్లి రామసుబ్బారావు తమ కుమార్తెలు వైకల్యంతో పాస్‌పోర్టు పొందేందుకు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ట్విట్టర్ ద్వారా ఆమె దృష్టికి తీసుకువెళ్ళగా, వెంటనే సుష్మాస్వరాజ్ స్పందించి 'పాస్‌పోర్టులు మీ ఇంటికే వస్తాయి.. దిగులు పడవద్దు' అని ఉదయం ట్వీట్ చేసి సాయంత్రానికల్లా నెల్లూరులోని వారి నివాసానికే తిరుపతి పాస్‌పోర్టు అధికారులను పంపించి పాస్‌పోర్టులను మంజూరు చేయించిన సంఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంది కూడా. పాస్‌పోర్టులతో పాటు ఈ సందర్భంగా ఆమె తమకు ఆ అధికారుల చేతనే స్వీట్లు కూడా పంపారని రామసుబ్బారావు చెప్తూ, సుష్మాస్వరాజ్ మృతి ఎంతో బాధాకరమంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం ప్రభుత్వసేవలను అందించడంలో సుష్మాస్వరాజ్ చూపిన చొరవ ఎంతో స్ఫూర్తిదాయకం. గతంలో పలుసార్లు నెల్లూరులో రాజకీయ సభలకు, స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యక్రమాలకు ఆమె హాజరైవున్నారు.

# ఇస్కాన్ ఆధ్వర్యంలో.. చిన్నారులకు పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నెల్లూరు నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఇస్కాన్ మందిరం వారి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. సంగీతం, శ్లోక ఉచ్చారణ, రంగులు వేయడం, చిత్రకళ, పాట్ మేకింగ్, క్రెడిల్‌మేకింగ్‌లతో పాటు ఫ్యాన్సీడ్రెస్ పోటీలు కూడా నిర్వహించారు. వందలాది మంది బాలలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. డాక్టర్ యశోధర, కృష్ణచైతన్య కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేసి బాలలకు సందేశం ఇచ్చారు. బాలలు శ్రద్ధాభక్తులతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డా.శుకదేవస్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భక్తి భావాలు చిన్నపిల్లల్లో మంచి ప్రేరణ కలిగిస్తాయని, దైవ



నామసంకీర్తనలు, పూజల ద్వారా ఆ భగవంతుని కరుణకు మనం పాత్రులు కావచ్చని అన్నారు.

# ఇద్దరు మొనగాళ్ళు

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇంత నష్టం జరుగుతున్నా ఆర్టికల్ 370ని తొలగించడానికి ఇంతవరకు ఏ ప్రభుత్వం సాహసం చేయలేదు. జమ్మూ–కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయాలని బీజేపీ ఎప్పటి నుండో డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ అయితే గతంలోనే ఎన్నోసార్లు ఆర్టికల్ 370ని తొలగించాలంటూ నిరసన దీక్షలు కూడా చేసి వున్నారు. ఈ 70ఏళ్ళ కాలంలో ఆర్టికల్370ని కాంగ్రెస్ వాళ్లయితే ఒక పెద్ద భూతంలా చూపిస్తూ, దానిని తొలగిస్తే ప్రపంచ వినాశనం జరుగుతుందన్నట్లుగా భయపెడుతూ వచ్చారు. జమ్మూ–కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని తొలగిస్తారని, ఈ దేశంలో ఆ రాష్ట్రాన్ని పూర్తిగా ఐక్యం చేస్తారని ఎవరు కూడా వూహించలేదు. ఆ వూహలను నేడు నరేంద్ర మోడీ, అమిత్‌షాలు నిజం చేశారు. ఆర్టికల్ 370ని తొలగిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో నరేంద్ర మోడీ ఇచ్చిన హామీని రెండు నెలల్లోనే అమలు చేశాడు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో మోడీ మరోసారి తనదైన ముద్ర వేసుకున్నాడు.

కేంద్రంలో రెండోసారి కూడా మోడీ నాయకత్వంలో బీజేపీ ఘన విజయం సాధించడం, మోడీ కేబినెట్‌లో అమిత్‌షాను హోంమంత్రిగా తీసుకోవడంతోటే ఆర్టికల్ 370 రద్దు కాబోతుందనే విషయం అర్థమైపోయింది. అయితే దానిని ఇంత తొందరగా అమలు చేస్తారని మాత్రం ఎవరూ వూహించలేకపోయారు. ఎంతో వ్యూహాత్మకంగా పార్లమెంటులో కాశ్మీర్ విభజన బిల్లును ఆమోదింపజేసిన అమిత్‌షా, ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేశాడు. ఈ బిల్లుకు కాంగ్రెస్, పిడిపి, డిఎంకె వంటి పార్టీలు తప్పితే మిగతా అన్ని పక్షాలు మద్దతు పలకడం, కాంగ్రెస్‌లో సైతం కొందరు సభ్యులు ఈ బిల్లుకు జైకొట్టడం మోడీ, షాలు సాధించిన మరో విజయంగా చెప్పుకోవచ్చు.

నోట్ల రద్దుతో మొదలుపెడితే జిఎస్టీ, సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్స్, ట్రిపుల్ తలాక్ బిల్లు, ఇప్పుడు ఆర్టికల్ 370 రద్దు... అన్నీ సాహసోపేత నిర్ణయాలే! కాంగ్రెస్ ప్రభుత్వాలైతే ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేవు. మోడీ, షాలు గుండెలు తీసిన బంట్లు. ఓటు బ్యాంకు రాజకీయాలకంటే జాతీయ వాద అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్న నాయకులు. ఏ అంశాన్నైనా టార్గెట్ చేశారంటే... సాధించకుండా వదలడం లేదు. ఇప్పుడు ఆర్టికల్ 370 రద్దుతోనే వదలరు.. రేపు కామన్ సివిల్ కోడ్... ఆ తర్వాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లకు కూడా వాళ్ళు గురిపెట్టబోతున్నారు.

# ఆదుకుంటారా? ఆడుకుంటారా?

(మొదటి పేజీ తరువాయి)

అంత ఆర్థిక సామర్థ్యం లేదు. వచ్చే ఆదాయం ప్రాధాన్యత పనులకే చాలవు. ఇక ఇప్పుడున్న మార్గమల్లా కేంద్రం నుండి సహకారం పొందడం. రాష్ట్రంలో జగన్ అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రప్రభుత్వం ఎంతవరకు సహకరిస్తుందన్నదే ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర పరిస్థితులు, అవసరాల దృష్ట్యా కేంద్రంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సన్నిహితంగానే వుంటున్నాడు. ఏపిలోని బీజేపీ నేతలు వైసిపి ప్రభుత్వంపై విమర్శల దాడి పెంచినా జగన్ మాత్రం ఆ పార్టీ జోలికి పోవడం లేదు. వారితో కయ్యానికి కాలు దువ్వడం లేదు. బీజేపీతో స్నేహాన్నే కోరుకుంటున్నాడు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పార్లమెంటులో ట్రిపుల్ తలాక్ బిల్లును వైసిపి వ్యతిరేకించినా జమ్మూ–కాశ్మీర్‌కు ఆర్టికల్ 370 రద్దు బిల్లు విషయంలో మాత్రం మద్దతు తెలపడం తెలిసిందే!

వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ప్రతిపక్షనేత కాదు. ప్రతిపక్షంలో వున్నప్పుడు సోనియాగాంధీని మొదలుకుని అందరితో యుద్ధం చేశాడు. ముఖ్యమంత్రి పాత్ర అలా వుండదు. యుద్ధం కంటే సంధి, సయోధ్య, సమన్వయం ముఖ్యం. కేంద్రం విషయంలో జగన్ ఇదే ధోరణితో వెళుతున్నాడు.


సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రెండోసారి ఢిల్లీ వెళ్లాడు. ప్రధాని నరేంద్ర మోడీని కలిశాడు. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులను వివరించాడు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ప్రత్యేక రాయితీల అంశాన్ని పరిశీలించాలని కోరాడు. ప్రజాసంక్షేమం దృష్ట్యా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు ఆర్థిక సహకారం ఆశించాడు. జగన్ విషయంలో మోడీ వైపు సానుకూల స్పందనేవుంది. పార్లమెంటులో ఆర్టికల్ 370పై జరిగిన చర్చలో కాంగ్రెస్‌పార్టీ ఏపిని దారుణంగా విభజించిందని, జమ్మూ–కాశ్మీర్ విషయంలో మేం పద్ధతిగా వ్యవహరించామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆంధ్రప్రదేశ్‌పై సానుభూతి చూపారు. విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందనే నిజం వారి మనసుల్లో వుంది. కాని, ఆ అన్యాయాన్ని సరిదిద్ది ఏపికి న్యాయం చేయాల్సిన దిశగానే ఇంకా కేంద్ర ప్రభుత్వం అడుగులు పడడం లేదు.

కేంద్రంలోని బీజేపీ ముందు ఏపి విషయంలో ఇప్పుడు రెండు దారులున్నాయి. ఒకటి విభజన చట్టం ప్రకారం వ్యవహరించి ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవడం... రెండోది ఎటువంటి నిధులు అందించకుండా అలివికాని హామీలను ఇచ్చిన జగన్‌తో ఆడుకోవడం. మొదటిది కేంద్రం బాధ్యత. రాష్ట్రాన్ని ఏదో ఒక కోణంలో ఆదుకుంటే ప్రజల్లో కూడా బీజేపీపై వున్న వ్యతిరేకత పోతుంది. తెలుగుదేశం స్థానంలో బీజేపీ బలపడడానికి బీజం పడుతుంది. కేంద్రంను ఒప్పించి నిధులు తెప్పించిన పాలకుడిగా జగన్‌కు మంచి పేరొస్తుంది. ఇది ఇటు వైసిపికి అటు బీజేపీకి లాభమే!

ఇక రెండో దారి ఇప్పటికిప్పుడు వైసిపి ప్రభుత్వాన్ని విఫలం చేయడం. అంటే రాష్ట్రానికి నిధులు ఎగ్గొట్టాలి. జగన్‌కు మంచి పేరు లేకుండా చేయాలి. ఇదే జరిగితే ఇక్కడ నష్టపోయేది వైసిపియే కాదు, బీజేపీ కూడా! రాష్ట్రానికి కేంద్రం ఇంకా అన్యాయం చేసిందనే ముద్ర ప్రజల్లో బలంగా నాటుకుపోతుంది. దీనివల్ల ఈ రెండు పార్టీలకు నష్టం జరిగి ఇంకో పార్టీకి పోతున్న వూపిరిని నిలబెట్టినట్లవుతుంది. కాబట్టి ఏపిని కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటేనే ప్రస్తుతం అధికారంలో వున్న వైసిపికే కాదు, భవిష్యత్‌లో ఏపిలో కాలు పెట్టాలనుకుంటున్న బీజేపీకి కూడా ప్రయోజనం.

## నెల్లూరుజిల్లా అభివృద్ధిపై...

# లోక్‌సభలో నినదించిన ఆదాల



నెల్లూరుజిల్లాలో రైల్వేపరంగా ప్రముఖంగా వినిపించే పేరు బిట్రగుంట! బ్రిటీష్ వాళ్ళ కాలంలోనే రైల్వేపరంగా బిట్రగుంట ఒక వెలుగు వెలిగింది. అప్పటి వెలుగుల ఆనవాళ్ళు ఇప్పుడు శిథిలావస్థలో వున్నాయి.

బిట్రగుంటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, కాంక్రీట్ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేయాలని, లోకోషెడ్‌ను పునరుద్ధరించాలనే కోరికలు ఎప్పటినుండో వున్నాయి. కేవలం ఆ అరుపులు మెరుపులుగానే మిగిలి పోతున్నాయి. గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన పనబాక లక్ష్మి ఇక్కడ కాంక్రీట్ స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అప్పటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్‌యాదవ్ చేత శంకుస్థాపన చేయించినప్పటికి అది కార్యరూపం దాల్చలేదు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధి గురించి ఇటీవల నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంటు సమావేశాలలో ప్రస్తావించారు. బిట్రగుంటలో కాంక్రీట్ స్లీపర్‌ల తయారీ యూనిట్‌ను లేదా ఎలక్ట్రికల్ మల్టీపుల్ యూనిట్ మెయింటెనెన్స్ సెంటర్‌ను గాని, క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్‌షాపులలో ఏదో ఒకటి ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో లాలూప్రసాద్‌యాదవ్ శంకుస్థాపన చేసిన కాంక్రీట్ స్లీపర్ యూనిట్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం వల్ల ఆ శిలాఫలకం మట్టి కొట్టుకుపోయిందన్నారు. బిట్రగుంటలో 1100 ఎకరాల రైల్వేస్థలం వృధాగా వుందని, కేంద్ర రైల్వే శాఖ సర్వే చేసి ఈ భూమిని రైల్వే అభివృద్ధికి వాడుకోవాలని సూచించారు.

అలాగే, 6వ తేదీన రామాయపట్నం పోర్టు గురించి ఆయన ప్రస్తావించారు. రామాయపట్నంలో మేజర్ పోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. మేజర్ పోర్టు ఏర్పాటుకు గతంలో కేంద్రం అంగీకారం తెలిపిందని, అయితే కొన్ని కారణాలను సాకుగా చూపి ఈ మేజర్ పోర్టును అడ్డుకుంటున్నారని అన్నారు. దుగరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి షార్ సెంటర్, పులికాట్ సరస్సు దగ్గర వుండడం వల్ల నిపుణుల కమిటీ అక్కడ అభ్యంతరం తెలిపి, రామాయపట్నంను సూచించిందని, ఈమేరకు అక్కడ పోర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. అందరికీ అనుకూలంగా వుండే రామాయపట్నంలో పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలకు కూడా ఎంతో ఉపయుక్తంగా వుంటుందని, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు.

### రహదారుల అభివృద్ధికి సహకరించండి...

బుధవారం కేంద్ర రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఆదాల, నెల్లూరు నుండి కృష్ణపట్నం వెళ్ళే రహదారిని, అలాగే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు - మైపాడు రోడ్డును నాలుగులైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే కృష్ణపట్నం నుండి బళ్లారి వరకు ముంబై రోడ్డును కూడా అభివృద్ధి చేయాలని ఆయన కేంద్రమంత్రిని కోరడం జరిగింది.



ఈ నెల 5న చెన్నైలోని కామరాజర్ అరంగంలో జరిగిన ఆలిండియా శివాజీ కల్చరల్ ట్రస్ట్ 40వ వార్షికోత్సవంలో 'జీవిత సాఫల్య పురస్కారాలను' అందుకుంటున్న ప్రముఖ వైద్యులు ప్రొ. సి.యం.కె.రెడ్డి, డా. విజి సంతోషం, డా. హెచ్‌వి హండే

## రామాయపట్నం పోర్టు...

# ఆశల వైపు అడుగులు



దాదాపు 9ఏళ్ళుగా పరిశీలనలకు, ప్రతిపాదనలకే పరిమితమైన రామాయపట్నం పోర్టుపై మళ్ళీ ఆశలు చిగురిస్తున్నాయి. పోర్టు ప్రయత్నాలలో బలమైన ఒక ముందడుగు పడింది. ఇటీవల పార్లమెంటులో నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ పోర్టు అంశాన్ని ప్రస్తావించగా, తాజాగా ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రామాయపట్నం వద్ద పోర్ట్ కమ్ షిప్‌యార్డ్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడైనా పోర్టును నిర్మించాలని భావిస్తే అందుకు రామాయపట్నమే మొదటి ప్రాధాన్యతలో వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నుండి బలమైన ప్రతిపాదనలు వెళ్లాయి. ఇక కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మిగిలివుంది.

యూపిఏ హయాంలోనే రాష్ట్రంలో పోర్టు నిర్మించాలని చెప్పి విశాఖ జిల్లా నక్కలపల్లి, నెల్లూరుజిల్లాలోని దుగరాజపట్నం, ప్రకాశం జిల్లాలోని రామాయపట్నంలను పరిశీలించారు. నేవీ అభ్యంతరాలతో నక్కలపల్లిని విరమించుకోగా, దుగరాజపట్నం వద్ద పోర్టుకు షార్ సెంటర్ దగ్గరగా వుండడం వల్ల ఇస్రో అభ్యంతరం తెలిపింది. అప్పటికే యూపిఏ-2లో దుగరాజపట్నం వద్దే పోర్టు అంటూ అప్పటి తిరుపతి ఎంపి చింతా మోహన్ తెగ హడావిడి చేశాడు. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా శంకుస్థాపన అని ప్రచారం చేశాడు. చివరకు ఎన్నికలకు ముందు చింతా మోహనే హడావిడిగా శంకుస్థాపన చేశాడు. కాని ఆ తర్వాత కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దుగరాజపట్నం పోర్టు ప్రస్తావనే లేకపోగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల మధ్యలో వున్న రామాయపట్నం తెరమీదకొచ్చింది. రామాయపట్నం వద్ద పోర్టు వస్తే ప్రకాశం జిల్లా కంటే కూడా నెల్లూరుజిల్లాలోని కావలి ప్రాంతమే ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. కాబట్టే కావలికి చెందిన నాయకులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి, బీద మస్తాన్‌రావులు, బీద రవిచంద్ర వంటివాళ్ళు దీని కోసం ఎక్కువగా ప్రయత్నించారు, పోరాటాలు చేశారు.

గత తెలుగుదేశం ప్రభుత్వం చివరి రోజుల్లో ఇక్కడ మైనర్ పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ఎలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

ఇప్పుడు వైసిపి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రామాయపట్నం పోర్టు సాధన దిశగా స్వయంగా ముఖ్యమంత్రే జోక్యం చేసుకోవడం శుభపరిణామమే! రామాయపట్నం సముద్ర తీరం పోర్టు నిర్మాణానికి అన్ని విధాలా అనుకూలమని సర్వేలు వెల్లడించాయి. పోర్టు అనుబంధ పరిశ్రమలకు కావాల్సిన భూముల లభ్యత సులభంగానే వుంటుంది. అయితే ఇక్కడ పోర్టు నిర్మించాలంటే గతంలో కృష్ణపట్నం పోర్టు నిర్మించేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంఓయూలోని నిబంధనలు అడ్డంకిగా మారకుండా చూసుకోవాలి. ముందు కేంద్రం నుండి రామాయపట్నం పోర్టుకు పచ్చజెండా వూపించుకోవడం పెద్ద పని. రాష్ట్ర ప్రభుత్వం ముందు ఆ ప్రయత్నంలో విజయం సాధించాల్సివుంది.

# దౌర్జన్యాలకు బెదరం - 'దేశం' నేతలు



జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగుదేశం నాయకులు

జిల్లాలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై రెండు నెలలుగా దాడులు జరుగుతున్నాయని జిల్లాలో ఇలాంటి వాతావరణం ఎప్పుడూ లేదని తెలుగు దేశం పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అధ్యక్షతన పార్టీ సమన్వయ సమావేశం జరిగింది. పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, త్రీమెన్ కమిటి సభ్యురాలు పోతుల సునీత, మాజీమంత్రి టి.రమేష్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, పాశం సునీల్ కుమార్, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి సమావేశానికి హాజరయ్యారు.

వైసిపి అధికారంలోకి వచ్చాక తెలుగు దేశం పార్టీ కార్యకర్తలపై, నాయకులపై జరిగిన దాడులను ఈ సందర్భంగా నాయకులు చర్చించారు. తెలుగుదేశం శ్రేణులపై జరుగుతున్న దాడులను వారు ఖండించారు. రెండు నెలలుగా దాడులు చేయడం, టిడిపి వారికి చెందిన ఆస్తుల విధ్వంసానికి పాల్పడడం, మళ్ళీ బాధితుల పైనే కేసులు పెట్టడం వంటి దుర్మార్గపు చర్యలకు వైసిపి వాళ్ళు పాల్పడుతున్నారని సోమిరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి దాడులకు అదిరేది బెదిరేది లేదని ధైర్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై ఇక ప్రజాపోరాటాల బాట పడదామని నిర్ణయించారు. గత ప్రభుత్వంలో అమలులో వున్న పనులను, పథకాలను ఆపేయడం పట్ల సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వైకాపా నాయకుల దాడులను అరికట్టాలంటూ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగికి వినతిపత్రం అందజేశారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com